

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | గురువారం 25-12-2025 | సంపుటి - 26 | సంచిక -217 | రూ : 4 | పేజీలు: 8


### నేను ఉన్నంత వరకు వారి కుటుంబాన్ని

## అధికారంలోకి రానివ్వను

### ఇదే నా శపథం: సీఎం

- మీ బిడ్డగా ఇదే గడ్డ మీద నుంచి చెబుతున్నానని సవాల్
- బీఆర్ఎస్ గతం..కాంగ్రెస్ భవిష్యత్తు అన్న సీఎం..
- నన్ను జైలుకు పంపించి నా వాళ్ళను ఇబ్బంది పెట్టాడని వ్యాఖ్య



2లో

### ఆకాశమే హద్దు

## ఇస్రో 'బాహుబలి' ఘన విజయం!

- నింగిలోకి అతిపెద్ద కమ్యూనికేషన్ శాటిలైట్
- అంతరిక్షం నుంచి నేరుగా మొబైల్‌కు ఇంటర్నెట్
- ఢీకొనే ముప్పు తప్పించేందుకు 90 సెకన్ల పాటు నిలిపివేత
- తర్వాత విజయవంతంగా ప్రయోగం

2లో






2లో

### సంక్రాంతికి గ్రామాల్లో

## అన్నా క్యాంటీన్లు

- గ్రామాలలో సంక్రాంతి కానుకగా ప్రారంభం కానున్న 70 అన్న క్యాంటీన్లు
- సంక్రాంతికి క్యాంటీన్లు ప్రారంభించే యోచనలో ప్రభుత్వం
- పట్టణ ప్రాంతాల్లో ఇప్పటికే కొనసాగుతున్న 205 క్యాంటీన్లు

### సర్పంచ్‌లకు తీపి కబురు..

## గ్రామాలకు ప్రత్యేకంగా రూ.10లక్షలు

- సర్పంచ్‌లకు నేరుగా ప్రత్యేక అభివృద్ధి నిధులు ఇస్తామన్న సీఎం
- పెద్ద గ్రామాలకు రూ.10 లక్షలు, చిన్న గ్రామాలకు రూ.5 లక్షలు ప్రకటన
- అర్హులైన వారందరికీ కార్డులు జారీ చేస్తామని హామీ
- పార్టీలకు అతీతంగా గ్రామాభివృద్ధికి పిలుపునిచ్చిన సీఎం

2లో



### న్యూ ఇయర్ వేడుకల వేళ..

## హద్దులు దాటితే కఠిన చర్యలు

- న్యూ ఇయర్ వేడుకల్లో నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవన్న సీపీ
- ఈవెంట్‌లకు పోలీస్ అనుమతి, సీసీటీవీ ఏర్పాటు తప్పనిసరని వెల్లడి...
- రాత్రి 10 గంటలకే లౌడ్ స్పీకర్లు, సౌండ్ సిస్టమ్‌లు క్లోజ్ చేయాలని ఆదేశాలు
- ఈ నెల 31న రాత్రి 9 గంటల నుండి డ్రంకెన్ డ్రైవ్‌పై స్పెషల్ డ్రైవ్ ఉంటుందన్న సజ్జనార్

2లో



### గడువులోగా ధాన్యం కొనుగోళ్లు

## పూర్తి చేయాలి: సీఎం ఆదేశం

- ధాన్యం కొనుగోళ్లల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్న సీఎం..
- ధాన్యం కొనుగోళ్లు సహా వివిధ పంట ఉత్పత్తుల మార్కెటింగ్‌పై సీఎం సమీక్ష
- మామిడి రైతులకు ప్రాసెసింగ్ యూనిట్లు సహకరించాలని సూచన
- ఉద్దేశపూర్వకంగా నష్టం కలిగించే పల్ప్ యూనిట్లపై కఠిన చర్యలకు ఆదేశం



2లో

### ఆరావళి మైనింగ్‌పై

## వెనక్కి తగ్గిన కేంద్రం..

- ఆరావళి పర్వతాల్లో కొత్త మైనింగ్ లీజులపై పూర్తి నిషేధం విధించిన కేంద్రం
- రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ ఆదేశాలు
- ఢిల్లీ నుంచి గుజరాత్ వరకు విస్తరించిన పర్వతశ్రేణికి వర్తింపు
- సుస్థిర మైనింగ్ కోసం ప్రత్యేక ప్రణాళిక రూపకల్పనకు ఐసీఎఫ్ఆర్ఈకి బాధ్యత
- ఇప్పటికే ఉన్న గనులపై మరింత కఠిన నిబంధనలు అమలు

2లో



# గడువులోగా ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలి: సీఎం ఆదేశం

అమరావతి: ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా రైతులకు ప్రయోజనం చేకూరేలా రబీ ఖరీఫ్ రబీ పంటలకు సంబంధించిన క్యాలెండర్‌ను రూపొందించాలని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. పంటల హార్వెస్టింగ్, మార్కెటింగ్ ప్రక్రియలు సక్రమంగా జరిగేలా చూడాలని ఆయన స్పష్టం చేశారు. సచివాలయంలో ధాన్యం సేకరణ, వివిధ పంట ఉత్పత్తుల మార్కెటింగ్‌పై నిన్న ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. రబీ ఖరీఫ్ రబీ సీజన్లలో ఏయే పంటలు వేయాలి, రైతులకు ఏది లాభదాయకం అనే విషయాలపై రైతుల్లో అవగాహన కల్పించాలని సీఎం సూచించారు. పంట ఉత్పత్తుల నాణ్యతను పెంచడంతో పాటు, కోత సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు తగిన సూచనలు ఇవ్వాలని అన్నారు. కోల్డ్ చైన్ వ్యవస్థతో పాటు దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లకు ఉత్పత్తులను తరలించేందుకు, వాటి ప్రాసెసింగ్‌పై దృష్టి సారించాలని సీఎం సూచించారు. దేశవ్యాప్తంగా వివిధ మార్కెట్లకు పంట ఉత్పత్తులను తరలించేందుకు వీలుగా రైల్ కార్గో వంటి లాజిస్టిక్స్ సౌకర్యాలను ఏర్పాటు చేయాలని అన్నారు. వివిధ జిల్లాల్లో నిర్దేశించిన గడువులోగా ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఎదురవుతున్న బ్యాంకు గ్యారెంటీ సమస్యలను పరిష్కరించి, రైతులకి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సీఎం స్పష్టం చేశారు. ఈ మేరకు సమీక్ష నుంచే రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కన్వీనర్‌తో ముఖ్యమంత్రి మాట్లాడి ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకే తరహాలో బ్యాంక్ గ్యారెంటీలు ఇవ్వాలని సీఎం బ్యాంకర్లను ఆదేశించారు. స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ విధానం మేరకు తక్షణమే చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రైతుల నుంచి చేసే కొనుగోళ్లలో మిల్లర్లు ఎక్కడా అక్రమాలకు పాల్పడకుండా చూడాలని సీఎం సూచనలు జారీ చేశారు. ఈ సమీక్షకు మంత్రులు కె. అచ్చెన్నాయుడు, నాదెండ్ల మనోహర్ వర్చువల్‌గా హాజరయ్యారు.

### న్యూ ఇయర్ వేడుకల వేళ..
## హద్దులు దాటితే కఠిన చర్యలు

హైదరాబాద్: నూతన సంవత్సర వేడుకలను ప్రజలు ప్రశాంతంగా, సురక్షితంగా జరుపుకునేలా చూడడానికి హైదరాబాద్ పోలీసులు సమాయత్తమవుతున్నారు. ఈ క్రమంలో న్యూ ఇయర్ ఈవెంట్లలో నిర్వాహకులు గానీ, ప్రజలు గానీ హద్దులు దాటినా లేక నిబంధనలు అతిక్రమించినా కఠిన చర్యలు తప్పవని హైదరాబాద్ సీపీ సజ్జనార్ హెచ్చరించారు. "నిబంధనలు ఉల్లంఘిస్తే కొత్త సంవత్సరం సంతోషం లేకుండా పోతుంది" అంటూ ఆయన వార్నింగ్ ఇచ్చారు. న్యూ ఇయర్ సందర్భంగా నగరంలో నిర్వహించే పార్టీలకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన విధి విధానాలపై సీపీ సజ్జనార్ క్షేత్రస్థాయి పోలీస్ సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా భద్రతా ఏర్పాట్లపై కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రతి ఈవెంట్ జరిగే ప్రాంతంలో తప్పనిసరిగా సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. అలాగే పార్టీల నిర్వహణకు ముందుగా పోలీస్ అనుమతిని తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి పొందాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో నిర్వహించే వేడుకల్లో సౌండ్ సిస్టమ్‌లు, లౌడ్ స్పీకర్లు రాత్రి 10 గంటలకే పూర్తిగా నిలిపివేయాలని సీపీ స్పష్టం చేశారు. శబ్ద కాలుష్యంపై ఫిర్యాదులు వస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించిన పోలీసులు, 15 షీ టీమ్స్ బృందాలను మఫ్టీలో రంగంలోకి దింపనున్నట్లు తెలిపారు. ఈ నెల 31 అర్ధరాత్రి నగరమంతటా డ్రంకెన్ డ్రైవ్‌పై ప్రత్యేక స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు సీపీ సజ్జనార్ వెల్లడించారు. రాత్రి 9 గంటల నుంచే డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు ప్రారంభమవుతాయని, అన్ని ప్రధాన రహదారులు, జంక్షన్ల వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హెచ్చరించారు. ప్రజలు ఆనందంగా న్యూ ఇయర్ వేడుకలు జరుపుకోవాలని, అయితే చట్టాన్ని గౌరవిస్తూ బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని హైదరాబాద్ పోలీసులు కోరుతున్నారు.

## ఆకాశమే హద్దు: ఇస్రో 'బాహుబలి' ఘన విజయం!

అమెరికా : భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో మైలురాయిని అధిగమించింది. తన అత్యంత శక్తిమంతమైన 'బాహుబలి' రాకెట్ LVM3M6 ద్వారా అమెరికాకు చెందిన 'బ్లూబర్డ్ 6' ఉపగ్రహాన్ని బుధవారం విజయవంతంగా కక్ష్యలో ప్రవేశపెట్టింది. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోట నుంచి జరిగిన ఈ ప్రయోగం భారతీయ అంతరిక్ష రంగ చరిత్రలో అతిపెద్ద వాణిజ్య విజయంగా నిలిచిపోయింది. ఉదయం 8:55 గంటలకు రెండో లాంచ్ ప్యాడ్ నుంచి 43.5 మీటర్ల ఎత్తున్న ఎల్వీఎం3 రాకెట్ గంభీరంగా నింగిలోకి ఎగిసింది. ప్రయాణం మొదలైన 15 నిమిషాలకే లక్ష్యానికి చేరుకుని, భూమికి 520 కిలోమీటర్ల ఎత్తులో ఉపగ్రహాన్ని కక్ష్యలో ప్రవేశపెట్టింది. 6,100 కిలోల బరువున్న ఈ బ్లూబర్డ్ ఉపగ్రహం భారత గడ్డపై నుండి ప్రయోగించిన అత్యంత భారీ ఉపగ్రహంగా రికార్డు సృష్టించింది. అమెరికాకు చెందిన 'ఏఎస్‌టీ స్పేస్‌మొబైల్' రూపొందించిన ఈ ఉపగ్రహం ప్రత్యేకత ఏంటంటే..దీనివల్ల ఎలాంటి అదనపు పరికరాలు లేకుండానే సాధారణ స్మార్ట్‌ఫోన్లకు నేరుగా అంతరిక్షం నుంచి 4G/5G బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందుతాయి. ఈ ప్రయోగంలో ఒక ఆసక్తికరమైన మలుపు చోటుచేసుకుంది. ముందుగా ఉదయం 8:54 గంటలకే రాకెట్ బయలుదేరాల్సి ఉంది. కానీ రాకెట్ వెళ్లే మార్గంలో అంతరిక్ష వ్యర్థాలు, లేదా ఇతర ఉపగ్రహాలు ఢీకొనే ప్రమాదం ఉందని ఇస్రో శాస్త్రవేత్తలు గుర్తించారు. దీంతో అప్రమత్తమైన ఇస్రో, కచ్చితమైన సమయ పాలనతో ప్రయోగాన్ని 90 సెకన్ల పాటు ఆలస్యం చేసి, 8:55 గంటల 30 సెకన్లకు ప్రయోగించింది. తద్వారా పెను ప్రమాదాన్ని నివారించి విజయాన్ని అందుకుంది. ప్రయోగం విజయవంతమైన తర్వాత ఇస్రో చైర్మన్ డాక్టర్ వి. నారాయణన్ మాట్లాడుతూ.. "ఎల్వీఎం3 రాకెట్ తన అద్భుతమైన ట్రాక్ రికార్డును మరోసారి నిరూపించుకుంది. ప్రపంచంలోనే అత్యుత్తమ రాకెట్లలో ఇదొకటని నిరూపితమైంది" అని సంతోషం వ్యక్తం చేశారు. ఇది ఇస్రో చేపట్టిన మూడవ పూర్తి స్థాయి వాణిజ్య మిషన్ కావడం విశేషం.

### నేను ఉన్నంత వరకు వారి కుటుంబాన్ని
## అధికారంలోకి రానివ్వను.ఇదే నా శపథం: సీఎం

హైదరాబాద్: కొడంగల్ బిడ్డగా ఇదే గడ్డ మీది నుంచి ఒక మాట చెబుతున్నానని, తాను రాజకీయాల్లో ఉన్నంత వరకు కేసీఆర్ సహా కల్వకుంట్ల కుటుంబాన్ని అధికారంలోకి రానివ్వనని, ఇదే తన శపథమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. నారాయణపేట జిల్లా కోస్గిలో ఏర్పాటు చేసిన సర్పంచ్‌ల సన్మాన సభలో ఆయన మాట్లాడుతూ, కేసీఆర్‌ను మళ్లీ అధికారంలోకి రానివ్వనని, ఇదే తన సవాల్ అన్నారు. ఇక బీఆర్ఎస్ గతమేనని, భవిష్యత్తు కాంగ్రెస్ మాత్రమే అన్నారు. 2029 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ 80కి పైగా సీట్లు సాధిస్తుందని, నియోజకవర్గాల పునర్విభజన జరిగి 153 అయితే 100కు పైగా స్థానాలు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. "రాసిపెట్టుకోండి. రెండోసారి కాంగ్రెస్ పాలనను తీసుకువస్తాం. ఇదే నా సవాల్" అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. పదేళ్లలో కేసీఆర్ ఏ ప్రాజెక్టును పూర్తి చేయలేదని ముఖ్యమంత్రి విమర్శించారు. కేసీఆర్ తనను జైలుకు పంపించాడని, తన కుటుంబ సభ్యులను ఇబ్బంది పెట్టాడని రేవంత్ రెడ్డి అన్నారు. కేసీఆర్ తనపై విమర్శలు చేస్తూ తోలు తీస్తానని హెచ్చరించారని, కానీ మా సర్పంచ్‌లు చింతమడకలో మిమ్మల్ని చీరి చింతాకు కడతారని హెచ్చరించారు. కేంద్రమంత్రిగా, ముఖ్యమంత్రిగా, రాష్ట్ర మంత్రిగా, తెలంగాణ సాధించిన అని చెప్పుకునే వ్యక్తిగా ఇలాంటి మాటలు మాట్లాడవచ్చా అని నిలదీశారు. మేం మాట్లాడాలనుకుంటే చాలా మాట్లాడుతామని, కానీ మర్యాద ఉండదని ఊరుకుంటున్నామని అన్నారు. మేం మాట్లాడటం మొదలు పెడితే మల్లన్న సాగర్‌లో దూకి చస్తావని ఘాటు వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఇదేనా అని ధ్వజమెత్తారు. పాలమూరు ప్రాజెక్టును ఎండగట్టారని, ప్రాజెక్టులు ఏవీ పూర్తి చేయలేదని అన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్లు పాలమూరు ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. పదేళ్లలో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని మండిపడ్డారు. కేసీఆర్ వలస వచ్చి పాలమూరు ఎంపీ అయ్యారని అన్నారు. పగ సాధించడం మొదలు పెడితే రాష్ట్రానికి నష్టం జరుగుతుందని వదిలి పెట్టానని అన్నారు. నేను ప్రమాణం చేసినప్పుడే ఆయన కూలబడ్డారని, ఇంతకంటే పెద్ద శిక్ష ఏముంటుందని వ్యాఖ్యానించారు. కేసీఆర్ ఫాంహౌస్‌ను బందీఖానాగా మార్చుకున్నారని, చర్లపల్లి, చంచల్‌గూడ జైలుకు పంపినా అదే పరిస్థితి ఉంటుందని అన్నారు. తాను నల్లమల నుంచి వచ్చి జెడ్పీటీసీ, ఎమ్మెల్యే, ఎంపీ తర్వాత ముఖ్యమంత్రిని అయ్యానని రేవంత్ రెడ్డి అన్నారు. కేసీఆర్ అసెంబ్లీకి వస్తే ఏ అంశంపై అయినా చర్చించడానికి సిద్ధమని వ్యాఖ్యానించారు. ఇప్పటికైనా కేసీఆర్ వయస్సును గౌరవిస్తామని, ఈ నెల 29 నుంచి జరగబోయే సమావేశాలకు కేసీఆర్ వచ్చి సూచనలు చేయాలని అన్నారు. ఖాళీగా ఉన్నప్పుడు పార్టీ కార్యాలయానికి వచ్చి ప్రెస్‌మీట్‌లు పెట్టడం కాదని అన్నారు.

### సర్పంచ్‌లకు తీపి కబురు..
## గ్రామాలకు ప్రత్యేకంగా రూ.10లక్షలు

హైదరాబాద్: కొడంగల్ నియోజకవర్గ పరిధిలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లకు నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లకు తీపి కబురు చెప్పారు. గ్రామాల అభివృద్ధి కోసం ఇకపై సర్పంచ్‌లకు నేరుగా నిధులు అందిస్తామని ప్రకటించారు. పెద్ద గ్రామాలకు రూ.10 లక్షలు, చిన్న గ్రామాలకు రూ.5 లక్షలు చొప్పున ప్రత్యేక అభివృద్ధి నిధిగా ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ నిధులు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీల జోక్యం లేకుండా నేరుగా గ్రామ పంచాయతీలకు అందుతాయని సీఎం స్పష్టం చేశారు. దీని ద్వారా గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగవంతం అవుతాయని పేర్కొన్నారు. అలాగే గ్రామాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు జారీ చేస్తామని హామీ ఇచ్చారు. తన రాజకీయ ప్రయాణంలో కొడంగల్ ప్రజల సహకారాన్ని గుర్తు చేసుకున్న సీఎం రేవంత్ రెడ్డి, "2009 నుంచి మీరు నన్ను మీ భుజాలపై మోశారు. మీ నమ్మకమే నన్ను ఈ స్థాయికి తీసుకువచ్చింది" అని అన్నారు. కొడంగల్‌ను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు. గ్రామాల్లో వివక్ష లేకుండా పాలన సాగాలని, పార్టీలుపంతాలు పక్కన పెట్టి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని సర్పంచ్‌లకు సూచించారు.

## ఆ రావళి మైనింగ్‌పై వెనక్కి తగ్గిన కేంద్రం..
## రాష్ట్రాలకు కీలక ఆదేశాలు

డిసెంబర్ 24 : ఆరావళి పర్వత శ్రేణుల పరిరక్షణ దిశగా కేంద్ర ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. ఈ పర్వత శ్రేణిలో కొత్తగా ఎలాంటి మైనింగ్ లీజులు మంజూరు చేయవద్దని పూర్తిస్థాయిలో నిషేధం విధిస్తూ రాష్ట్ర ప్రభుత్వాలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఢిల్లీ నుంచి గుజరాత్ వరకు విస్తరించి ఉన్న మొత్తం ఆరావళి ప్రాంతానికి ఈ ఆదేశాలు వర్తిస్తాయని కేంద్ర పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. అక్రమ, అనియంత్రిత మైనింగ్‌కు అడ్డుకట్ట వేయడంతో పాటు ఈ పర్వతాలను ఒకే భౌగోళిక వ్యవస్థగా పరిరక్షించడమే తమ లక్ష్యమని కేంద్రం పేర్కొంది. ఈ నిషేధాన్ని మరింత పటిష్ఠంగా అమలు చేసేందుకు గాను ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఫారెస్ట్రీ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ కు కీలక బాధ్యతలు అప్పగించింది. ప్రస్తుతం ఉన్న నిషేధిత ప్రాంతాలకు అదనంగా, మైనింగ్‌ను శాశ్వతంగా నిషేధించాల్సిన మరిన్ని ప్రాంతాలను శాస్త్రీయంగా గుర్తించాలని ఆదేశించింది. అలాగే మొత్తం ఆరావళి ప్రాంతానికి 'సుస్థిర మైనింగ్ యాజమాన్య ప్రణాళిక'ను రూపొందించాలని సూచించింది. ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు అనుగుణంగానే ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే అనుమతులతో నడుస్తున్న మైనింగ్ కార్యకలాపాలపై మరింత కఠిన నిబంధనలు అమలు చేయాలని, పర్యావరణ నిబంధనలను తప్పనిసరిగా పాటించేలా చూడాలని కేంద్రం రాష్ట్రాలకు స్పష్టం చేసింది. భూగర్భ జలాలను పరిరక్షించడంలో ఆరావళి పర్వతాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని, వాటి సంరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించింది.

## సంక్రాంతికి గ్రామాల్లో అన్నా క్యాంటీన్లు

విజయవాడ: గ్రామీణ ప్రజలకు సంక్రాంతి కానుకగా ఏపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్లు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ నియోజకవర్గ, మండల కేంద్రాల్లో ఒకేసారి 70 అన్న క్యాంటీన్లు ప్రారంభించనున్నట్లు తెలిపింది. ప్రస్తుతం వివిధ దశల్లో ఉన్న క్యాంటీన్ల నిర్మాణ పనులు జనవరి 10లోగా పూర్తి చేయనుండగా, జనవరి 13 నుంచి 15 మధ్య క్యాంటీన్లు ప్రారంభించే యోచనలో ప్రభుత్వం ఉంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఇప్పటికే పట్టణ ప్రాంతాల్లో 205 అన్న క్యాంటీన్లు ప్రారంభించి కొనసాగిస్తున్న సంగతి తెలిసిందే. వీటిలో రోజూ మూడు పూటలా కలిపి 2 లక్షల మందికిపైగా ప్రజలు భోజనం చేస్తున్నారు. ఉదయం, రాత్రి అల్పాహారం, మధ్యాహ్నం భోజనాన్ని పూటకు రూ.5కే అందిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ క్యాంటీన్లు ఏర్పాటు చేయాలన్న ఎమ్మెల్యేల విజ్ఞప్తి నేపథ్యంలో ప్రభుత్వం మరో 70 క్యాంటీన్లను మంజూరు చేసింది. పట్టణాలు, నగరాల్లో కొనసాగుతున్న 205 అన్న క్యాంటీన్ల ద్వారా ఇప్పటి వరకు 7.20 కోట్ల మందికిపైగా పేదలకు ఆహారం అందించారు. వీరిలో 3.16 కోట్ల మంది మధ్యాహ్న భోజనం చేయగా, 2.62 కోట్ల మంది ఉదయం అల్పాహారం, 1.42 కోట్ల మంది రాత్రి అల్పాహారం పొందారు. విశాఖపట్నం, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో అన్న క్యాంటీన్లకు అత్యధిక స్పందన లభిస్తోంది.

## రాష్ట్రంలో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు

**: మంత్రి పొన్నం కీలక ఆదేశాలు**

రాష్ట్ర రోడ్డు రవాణా శాఖకు రోడ్డు భద్రతయే ప్రథమ ప్రాధాన్యమని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. జనవరి 1 నుండి నెల రోజుల పాటు జరిగే జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని అధికారులను ఆయన ఆదేశించారు. బుధవారం రవాణా శాఖ అధికారులతో జూమ్ సమావేశంలో మంత్రి ఈ పాల్గొన్నారు. గ్రామం నుంచి రాజధాని వరకు ఉన్న ప్రతి స్కూల్, కాలేజీలో రవాణా శాఖ అధికారి స్వయంగా వెళ్లి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించాలని మంత్రి పొన్నం ఆదేశించారు. రాష్ట్రంలో నిత్యం రోడ్డు ప్రమాదాల వల్ల 20 మంది వరకు మరణిస్తున్నారని, మరణాల రేటును జీరోకి తగ్గించడమే లక్ష్యంగా అవగాహన కల్పించాలని మంత్రి పొన్నం తెలిపారు. లయన్స్ క్లబ్, రోటరీ క్లబ్‌లను భాగస్వామ్యం చేసి వారిని జనవరి



26న జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ప్రశంస పత్రంతో సత్కరించాలని తెలిపారు. కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా కలెక్టర్లు, పోలీస్ అధికారులు, నూతనంగా ఎన్నికైన సర్పంచ్ లు పాల్గొనేలా ఆర్టీఏ సభ్యులు ఆహ్వానించాలని సూచించారు. విద్యార్థులు, డ్రైవర్లు, డాక్టర్లను ఇన్వాల్వ్ చేయాలని సూచించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ పాఠశాల విద్యార్థులు కూడా పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాల్లో రోడ్డు భద్రతా ర్యాలీలు, వాకథాన్‌లు, హెల్మెట్ అవగాహన కార్యక్రమాలు, రిపబ్లిక్ డే వేడుకల్లో రవాణా శకకటాల ప్రదర్శన, రంగోలి పోటీలు, క్విజ్ పోటీలు, వ్యాసరచన పోటీలు, సీటు బెల్ట్, కంటి పరీక్షలు, బ్లడ్ డొనేషన్ క్యాంపులు, పాఠశాల బస్సుల భద్రతా తనిఖీలు, పాదచారుల భద్రత అవగాహన, ఓవర్ లోడింగ్, విద్యార్థులకు వర్క్ షాపులు తదితర కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. జిల్లా రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశం ఏర్పాటు చేసి చేయాల్సిన కార్యాచరణపై కలెక్టర్ సమీక్షించాలన్నారు. చేసిన కార్యక్రమాల ఫోటోలు, విజువల్స్ విధిగా రవాణా శాఖ కార్యాలయానికి పంపించాలని మంత్రి పొన్నం ఆదేశించారు.

### పదేళ్లలో చంద్రుడిపై అణు విద్యుత్ ప్లాంట్
## ఏర్పాటు చేయాలని రష్యా యోచన

వచ్చే దశాబ్ద కాలంలో చంద్రుడిపై అణు విద్యుత్ ప్లాంట్‌ను నెలకొల్పాలని రష్యా యోచిస్తోంది. చంద్రుడిపై అన్వేషణలో భాగంగా పలు దేశాలు కీలక ప్రాజెక్టులు చేపడుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో రష్యా అణు విద్యుత్ ప్లాంట్‌కు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. తమ లూనార్ ప్రోగ్రాంతో పాటు రష్యా, చైనా ఉమ్మడి పరిశోధన కేంద్రానికి విద్యుత్ సరఫరా చేసే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును చేపట్టనున్నట్లు వెల్లడించింది. చంద్రుడిపై 2036 నాటికి విద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని ప్రణాళిక రచించినట్లు రష్యా ప్రభుత్వం ఆధ్వర్యంలోని అంతరిక్ష పరిశోధన సంస్థ రాస్కాస్‌మస్ వెల్లడించింది. ఇందుకోసం ఏరోస్పేస్ కంపెనీ లావొచ్‌కిన్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపింది. రోవర్లు, అబ్జర్వేటరీ, రష్యా, చైనా సంయుక్త పరిశోధన కేంద్రంతో పాటు తమ సొంత లూనార్ ప్రోగ్రాంకు విద్యుత్‌ను అందించడమే ఈ ప్రాజెక్టు ఉద్దేశమని రష్యా పేర్కొంది. రష్యా అంతరిక్ష పరిశోధనల్లో ముందుంది. 1961లోనే యూరి గగారిన్‌ను అంతరిక్షంలోకి పంపించింది. అంతరిక్షంలోకి వెళ్లిన మొదటి మానవుడు యూరి గగారిన్. అయితే గత కొన్ని దశాబ్దాలుగా అమెరికా, చైనాతో పోలిస్తే వెనుకబడినట్లుగా కనిపిస్తోంది. 2023లో రష్యా ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన లూనా25 చంద్రుడిపై దిగడానికి ముందే కూలిపోయింది.

# పెన్షన్ బకాయిలను ఏకమొత్తంలో ఒకేసారి చెల్లించాలి..

- పెన్షన్ దారుల దీక్షకు పిఆర్ టియు జిల్లా శాఖ సంపూర్ణ మద్దతు
- జిల్లా పిఆర్ టి యూ అధ్యక్షుడు మాణయ్య



అందోలు, ప్రజాస్ఫూర్తి: తెలంగాణ ప్రభుత్వ పెన్షన్ దారుల జాయింట్ యాక్షన్ కమిటీ ఆహ్వానం మేరకు బుధవారం నిర్వహించిన ఒకరోజు నిరాహారదీక్ష శిబిరాన్ని సందర్శించారు. సంగారెడ్డి జిల్లా పీఆర్ టీయూ అధ్యక్షులు ఎ.మాణయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.ప్రభులు సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సంధర్భంగా శిబిరాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తూ గత ఏడాది మార్చి తర్వాత రిటైర్ అయిన ఉద్యోగుల పరిస్థితి దుర్భరంగా మారిందని 20 నెలలుగా 14వేల మంది ఉద్యోగులు పదవి విరమణ చేసినా వాళ్లకు రావలసిన పెన్షన్ బకాయిలు ఇంతవరకు అందలేదని, ఆర్థిక ప్రయోజనాలతో పూర్తి చేద్దామను కున్న పిల్లల పెళ్ళిళ్ళు, గృహ నిర్మాణం, వైద్యపరమైన ఖర్చులకు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. జీవితాంతం కష్టపడి రిటైర్మెంట్ బెనిఫిట్ మీద ఆశ పెట్టుకున్న వారు ఆర్థిక వెసులుబాటు లేక మానసికంగా బాధపడుతూ రోగాల పాలై ఇప్పటికీ 36 మంది చనిపోవడం బాధాకరంగా పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రిటైర్ అయిన ఉద్యోగ ఉపాధ్యాయులకు రావలసిన ప్రయోజనాలను ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నదని అన్నారు. బకాయిలు అందక మనోవేదనతో రిటైరైన ఉద్యోగులు చనిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమని తక్షణమే స్పందించి వారికి రావాల్సిన పెన్షన్ బకాయిలను ఏకమొత్తంలో ఒకేసారి చెల్లించాలని సంగారెడ్డి జిల్లా శాఖ పక్షాన కోరుతున్నట్లు తెలిపారు.

# ఎంపీటీసి, జెడ్పిటీసి ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- * రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా



అందోలు, ప్రజాస్ఫూర్తి: రాబోయే స్థానిక సంస్థల ఎంపీటీసీ జెడ్పిటిసి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిపే లక్ష్యంగా ముందుకు వెళ్లాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా అన్నారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల బిజిలీపూర్ సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ వార్డు సభ్యులు గెలుపొందడంతో బుధవారం స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి సంగారెడ్డి లోని మంత్రి నివాసంలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ మద్దతు దారులుగా వార్డు సభ్యులు గెలుపొందిన వారిని మంత్రి శాలువాతో సత్కరించి అభినందించారు. సర్పంచ్ ఎన్నికల్లో గ్రామ సర్పంచ్ పీఠం కాంగ్రెస్ పార్టీ కోల్పోవడానికి గల కారణాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. తక్కువ మెజారిటీతో సర్పంచ్ పీఠం కోల్పోవడం జరిగిందన్నారు. ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమని, ఓటమిని ఛాలెంజ్ గా తీసుకొని రాబోయే స్థానిక సంస్థల జెడ్పిటిసి,ఎంపిటిసి ఎన్నికల్లో గెలిపి లక్ష్యంగా ముందుకెళ్లాలని సూచించారు. ఓటమిపై ఎవరు అధైర్యపడవద్దని ఓటమి గెలుపుకు నాంది అని ప్రజా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంతో పాటు అర్హులైన వారందరికీ అందేలా చూస్తే రాబోయే ఎన్నికల్లో విజయం మనదేనన్నారు. పార్టీ కార్యకర్తలంతా కలిసికట్టుగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఏంపిటిసి సంగప్ప, యువ నాయకుడు అరవింద్, శివశంకర్, మల్లేశం, సాయిలు, రాజు, శంకర్, సంఘామేశ్వర్, అనిల్, నవీన్, వార్డు సభ్యులు శివనీల మల్లేశం, రజిని తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# చౌటుప్పల్ మండల కేంద్రంలో బస్ డిపో ఏర్పాటు చేయాలి

: తీగుళ్ళ శ్రీనివాస్



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: రాష్ట్ర రాజధాని 50కిలోమీటర్ల దూరంలో ఉండి అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న చౌటుప్పల్ మండల కేంద్రంలో బస్ డిపోను ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి తీగుళ్ళ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చౌటుప్పల్ మండల కేంద్రం దాదాపు 7మండలాల ప్రజలకు వ్యాపారాల కేంద్రంగా ఉందన్నారు. చౌటుప్పల్, సంస్థ సంస్థాన్ నారాయణపురం, గట్టుప్పల్, మునుగోడు, భూధాన్ పోచంపల్లి, వలిగొండ, చిట్యాల మండలాల నుంచి వేల సంఖ్యలో విద్యార్థులు, ప్రజలు నిత్యం చౌటుప్పల్ కు రాకపోకలు నిర్వహిస్తున్నారన్నారు. ప్రజలకు రవాణా సౌకర్యం చాలా తక్కువగా ఉండడంతో, అధిక ఇబ్బందులకు గురైతున్నారన్నారు. చౌటుప్పల్ లో ఉన్న బస్ స్టేషన్ ను బస్ డిపోగా మార్చితే ప్రజలకు రవాణా ఇబ్బందులు తీరుతాయన్నారు. డిపో ఏర్పాటుకు అవసరమయ్యే స్థలం కూడా చౌటుప్పల్ బస్ స్టేషన్ కు ఉందని, ప్రస్తుతం ఆ స్థలం ప్రైవేట్ వాహనాలకు, ప్రైవేట్ స్కూల్ బస్సులకు పార్కింగ్ స్థలంగా మారిపోయిందని పేర్కొన్నారు. గతంలో నార్కట్ పల్లి డిపో ఉన్నప్పుడు ప్రజలకు బస్సు సౌకర్యం కొంత మెరుగుగా ఉండేదని, కానీ ఇప్పుడు నార్కట్ పల్లి డిపోను తీసివేయడం, ఈ దగ్గర ప్రాంతంలో ఎక్కడ కూడా డిపో లేదన్నారు. చౌటుప్పల్ కు నల్లగొండ, యాదగిరిగుట్ట, దేవరకొండ డిపోలు 50కిలోమీటర్ల దూరంలోనే ఉన్నాయన్నారు. దీంతో బస్సు సర్వీసులు సరైన విధంగా లేవన్నారు. ఒక నల్లగొండ డిపో బస్సులు మాత్రమే వెళ్ళగా సర్వీసులను నడుపుతుందని, యాదగిరి గుట్ట డిపోగానీ, దేవరకొండ, డిపో గానీ ఎలాంటి సర్వీసులు నడపడం లేదని పేర్కొన్నారు. కావున డిపో వేయడానికి అన్ని విధాలుగా అవకాశం చౌటుప్పల్ బస్ స్టేషన్ ను ఉందని, బస్ డిపోగా చేయడం వలన 7మండలాల ప్రజలకే కాకుండా అదనంగా ఇంకో 3మండలాల ప్రజలకు బస్సు రవాణా ఇబ్బందులు తొలగిపోతాయన్నారు. చౌటుప్పల్ బస్ స్టేషన్ ను బస్ డిపోగా మార్చితే కోట్ల విలువచేసే ఆర్టీసీ స్థలం భూమి వృధాగా కాకుండా కబ్జాలకు గురికాకుండా ప్రజా ప్రయోజనంలోకి వస్తుందన్నారు.



# ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలి

- * రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు

ప్రజాస్ఫూర్తి, కాప్రా : ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు అన్నారు. బుధవారం వృద్ధుల సహాయం, సంరక్షణ లక్ష్యంగా రూపొందించిన అత్యున్నతమైన కార్యక్రమం “గోల్డెన్ కేర్ ” కింద 3వ మెగా ఉచిత వైద్య శిబిరం ఘనంగా నిర్వహించారు. సుధీర్ బాబు ఆలోచనా దృక్పథంతో, రాచకొండ పోలీస్ కమిషనరేట్ , రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ సంయుక్త ఆధ్వర్యంలో లక్ష్మీ గార్డెన్స్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన ఈ వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు హాజరై మాట్లాడుతూ వృద్ధుల సంక్షేమం పట్ల పోలీస్ శాఖ అంకితభావాన్ని పునరుద్ఘాటించారు. ఈ శిబిరం ద్వారా మొత్తం 244 మంది వృద్ధులకు సమగ్ర వైద్య సేవలు అందించారు.జిమ్ కేర్ పాలొమీ, సోలిస్ ఐ కేర్, సౌజన్య డెంటల్, మా ఈ.ఎన్.టి సంస్థల సహకారంతో జనరల్ మెడిసిన్, కార్డియాలజీ, ఆర్థోపెడిక్స్, డెంటిస్ట్రీ, ఆప్తాల్మాలజీ విభాగాల్లో నిపుణులైన వైద్యులు సంప్రదింపులు జరిపారు. అదేవిధంగా ఈసీజీ, రక్తపోటు (బీపీ), రాండమ్ బ్లడ్ షుగర్ వంటి కీలక వైద్య పరీక్షలను పూర్తిగా ఉచితంగా నిర్వహించారు. ఒకే చోట అన్ని రకాల వైద్య సదుపాయాలు అందించడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తూ, రాచకొండ కమిషనరేట్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి డీసీపీ సి.హెచ్. శ్రీధర్, ఉమెన్ సేఫ్టీ డీసీపీ ఉషా రాణి, మల్కాజిగిరి అడిషనల్ డీసీపీ వెంకట రమణ, కుషాయిగూడ ఏసీపీ వై. వెంకట్ రెడ్డి, ఉమెన్ సేఫ్టీ ఏసీపీ వెంకటేశ్వర్లు, ఆర్కెఎస్సి జాయింట్ సెక్రటరీ రాధికానాథ్, ఆర్కెఎస్సి చీఫ్ కోఆర్డినేటర్ ఎం. సావిత్రి, కె. సూర్యనారాయణ, కుషాయిగూడ, నెరేడ్‌మెట్, చర్లపల్లి, జవహర్నగర్, కీసర సీఐలు, షీ టీమ్ సీఐలు ఎం. ముని, అంజయ్యలు పాల్గొని శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించారు.




# అన్ని రంగాల్లో బేడ బుడగ జంగాలు రాణించాలి

- * రాజన్న సిరిసిల్ల జిల్లా బేడ బుడగ జంగాల కమిటీ నాయకులు డొక్క రాజేష్

ప్రజాస్ఫూర్తి,సిరిసిల్ల : బేడ బుడగ జంగాలు అనాదిగా అణిచివేతకు గురయ్యాయని, ప్రస్తుత సమాజంలో సామాజిక, విద్య, ఆర్థిక, రాజకీయ అన్ని రంగాల్లో బేడ బుడగ జంగాలు ముందుండి రాణించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా బేడ బుడగ జంగాల కమిటీ నాయకులు డొక్క రాజేష్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో సర్పంచ్, వార్డు మెంబర్ స్థానాల్లో సుమారు 50 మంది బేడ బుడగ జంగాల కులానికి చెందిన అభ్యర్థులు పోటీ చేయగా గెలిచినా, ఓడిన అనే తారతమ్యం లేకుండా సిరిసిల్ల జిల్లా కేంద్రంలో బుధవారం ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా బేడ బుడగ జంగాల కమిటీ నాయకులు డొక్కా రాజేష్, హనుమంతు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ముందుగా డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఎన్నికల్లో పోటీలో నిలిచిన 50 మంది బేడ బుడగ జంగాల అభ్యర్థులకు శాలువా కప్పి, పూలమాలలు వేసి, జ్ఞాపికలను అందజేసి ఘనంగా సన్మానించారు. అనంతరం డొక్క రాజేష్ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి బేడ బుడగ జంగాలకు చెందిన కులస్తులు సుమారు 50 మంది ఎన్నికల పోటీలో ఉత్సాహంగా నిలిచారని అన్నారు. గెలిచిన, ఓడినప్పటికీ ఉత్సాహంగా ఎన్నికల్లో బరిలో నిలవడం పట్ల వారిని అభినందించారు. ఇదే విధంగా రానున్న ఎన్నికల్లో సైతం బేడ బుడగ జంగాలు అవకాశం వచ్చిన చోట బరిలో నిలవాలని, బరిలో నిలిచిన బేడ బుడగ జంగాల అభ్యర్థులను గెలిపించడం కోసం తోటి బేడ బుడగ జంగాల కులస్తులు ముందుండి కృషి చేయాలన్నారు. ప్రభుత్వం కూడా బేడ బుడగ జంగాల అభ్యున్నతికి కృషి చేయాలని, అన్ని రంగాల్లో బేడ బుడగ జంగాలకు సముచిత న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విభూది హన్మంతు, అనరాశి జలంధర్, చింతల రంగయ్య, వానరాశి అశోక్, చింతం శంకర్, చింతం పోశెట్టి, కడమంచి శేఖర్, మ్యాకల మహేష్, విభూది రవి, అనరాశి రమేష్ తదితరులున్నారు.

# గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ కార్యాలయంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు



ప్రజా స్ఫూర్తి;భద్రాచలం: యేసుక్రీస్తు జన్మదినాన్ని స్మరిస్తూ రాబోయే క్రిస్మస్ పండగ భారతదేశ ప్రజలకు ఆనందం,ప్రేమ,శాంతి, సహనం ప్రసాదించాలని ఆకాంక్షిస్తూ గిరిజన ఇంజనీరింగ్ శాఖ భద్రాచలం కార్యాలయంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మధుకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగులంతా కలిసి వేడుకలు జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందని ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీసస్ క్రీస్తు బోధనలు సమాజంలో ప్రేమ, శాంతి,ఐక్యత భావాలను పెంపొందించేలా ఉంటాయన్నారు. క్రైస్తవ సోదరులకు ముందస్తుగా క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ వెంకటస్వామి, కార్యాలయ సిబ్బంది భవాని బుచ్చులు, వెంకన్న, బుచ్చిబాబు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# ట్రెక్కింగ్ ద్వారా యువతలో ఆరోగ్యం, క్రమశిక్షణతో పాటు ప్రకృతి పట్ల బాధ్యత పెరుగుతుంది

- * జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్



ప్రజా స్ఫూర్తి;భద్రాద్రి కొత్తగూడెం: ట్రెక్కింగ్ చేయడం ద్వారా యువతలో శారీరక ఆరోగ్యం, క్రమశిక్షణతో పాటు ప్రకృతి పట్ల బాధ్యతాభావం పెరుగుతుందని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. జిల్లాలో “ఏరు ఫెస్టివల్” కార్యక్రమంలో భాగంగా బుధవారం పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీనివాస నగర్‌లో ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం గుట్టపై ట్రెక్కింగ్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్‌తో పాటు ట్రైనీ కలెక్టర్ సౌరబ్ స్వయంగా పాల్గొని గుట్టపై కొంత దూరం వరకు ట్రెక్కింగ్ చేశారు. ట్రెక్కింగ్ సమయంలో పరిసర ప్రాంతాల్లోని అటవీ సంపద, సహజ ప్రకృతి అందాలను పరిశీలిస్తూ యువతతో కలిసి ఉత్సాహంగా కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. అనంతరం గుట్టపై ఉన్న హిల్ వ్యూ పాయింట్‌ను సందర్శించి అక్కడి నుంచి పాల్వంచ పట్టణాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలోని సహజ దృశ్యాలు, పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యతపై అధికారులు యువతతో చర్చించారు.అనంతరం జిల్లా కలెక్టర్ శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దర్శనం చేసుకుని స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఆలయ పరిసరాల పరిశుభ్రత, భక్తులకు అందుతున్న సౌకర్యాలపై ఆలయ బాధ్యులతో వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పాల్వంచ ప్రాంతంలో ఇలాంటి ప్రకృతి సౌందర్యంతో కూడిన పర్యాటక ప్రాంతాలు ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండటం గర్వకారణమని తెలిపారు. కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి ప్రకృతికి దగ్గరగా ఉల్లాసంగా గడపడానికి ఇది అత్యంత అనుకూలమైన ప్రదేశమని అన్నారు. యువత, విద్యార్థులు ఇలాంటి ట్రెక్కింగ్ కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా శారీరక దృఢత్వం పెరగడమే కాకుండా ప్రకృతి సంరక్షణపై అవగాహన పెరుగుతుందని తెలిపారు. జిల్లాలో ప్రకృతి ఆధారిత పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు “ఏరు ఫెస్టివల్” ద్వారా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల పర్యాటక అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి యం. పరంధామ రెడ్డి, తహసీల్దార్లు దుర్గాప్రసాద్, భగవాన్ రెడ్డి, ఆలయ బాధ్యులు కొత్త వెంకటేశ్వర్లు, లక్ష్మణ్, టీఎన్జీవో ప్రతినిధి చైతన్య భార్గవ్, అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరీ మహిధర్, కోచ్‌లు నాగేంద్ర, కల్యాణ్ (ఆర్చరీ), నబీ (రైఫిల్ షూటింగ్), రమేశ్ (టైక్వాండో), వివిధ క్రీడాకారులు, ట్రైబల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాల పాల్వంచ ప్రిన్సిపల్ అనురాధ, పిడి శ్వేత, విద్యార్థులు, ఎన్సిసి, ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు, ఆలయ సిబ్బంది, స్థానిక ప్రజలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కొత్తగూడెం రైతు బజారు వ్యాపారి ఇంట్లో అగ్నిప్రమాదం

- * రూ.5.50 లక్షల నగదు, బంగారం–వెండి దగ్ధం

ప్రజా స్ఫూర్తి; సుజాతనగర్: కొత్తగూడెం రైతు బజారులో కూరగాయల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఓ కుటుంబాన్ని అగ్నిప్రమాదం తీవ్ర విషాదంలోకి నెట్టింది. ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం చివరి దశలో ఉండటంతో మిగిలిన పనులు పూర్తి చేయించేందుకు చీటీ పాడి తెచ్చుకున్న అక్షరాలా రూ.5 లక్షల 50 వేల నగదును ఇంట్లో భద్రపరిచారు. అదేవిధంగా అర తులం బంగారం, 10 తులాల వెండితో పాటు ఇతర విలువైన వస్తువులను కూడా ఇంట్లోనే ఉంచి తాళం వేసి వ్యాపార నిమిత్తం కొత్తగూడెంకు వెళ్లారు. ఇల్లు నిర్మాణంలో ఉండటంతో ఇంటి ముందు భాగంలో రేకులతో తాత్కాలిక షెడ్ ఏర్పాటు చేసి అందులో సామానంతా భద్రపరిచారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం 9.30 నుంచి 10 గంటల మధ్యలో ఇంటి నుంచి భారీగా మంటలు ఎగసిపడుతున్నట్లు గమనించిన స్థానికులు బాధిత కుటుంబానికి సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు అక్కడికి చేరేసరికి అప్పటికే ఇల్లు పూర్తిగా అగ్నికి ఆహుతై దగ్ధమైంది. స్థానికులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఎవరూ దగ్గరికి



వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఫలితంగా కట్టుబట్టలు తప్ప ఇంట్లో ఉన్న నగదు, బంగారం, వెండి సహా మొత్తం సామానంతా కాలిపోయింది.ఈ ఘటనతో బాధిత కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. ముఖ్యంగా రైతు బజారులో వ్యాపారం చేసే ఆ మహిళ ఇంటికి చేరుకునే సరికి “కట్టుబట్టలే మిగిలాయి” అంటూ బోరున విలపించినట్లు స్థానికులు తెలిపారు. ఇదిలా ఉండగా, ఈ అగ్నిప్రమాదంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.నిజంగా ప్రమాదవశాత్తూ మంటలు చెలరేగాయా..? లేదా చీటీ నగదు విషయం తెలిసి ఎవరైనా దొంగతనం చేసి నిప్పంటించారా..? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అగ్నిప్రమాదానికి గల కారణాలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# మద్యానికి బలైపోతున్న బతుకులు..!

* **బెల్టుషాపులతో నిత్యం మద్యం మత్తులో యువత**
* **కుటుంబాలను ఆగం చేసుకుంటున్న మద్యంప్రియులు**
* **నియంత్రణలేని బెల్టుషాపులతో ఆగమాగం..**
* **గుడులు, బడులకు సమీపంలోనే వైన్స్ ఏర్పాటు**
* **పట్టించుకోని ఎక్సైజ్ శాఖాధికారులు**



ప్రజా స్ఫూర్తి; భద్రాద్రి కొత్తగూడెం: యువత మేలుకో... మద్యం మత్తు నుంచి కోలుకో... కోరికోరి కుటుంబాలను ఆగం చేసుకోకు... కన్నవారిని... కుట్టుకున్నవారిని కన్నీటిపాలుచేసి నిండు జీవితాన్ని కడతేర్చుకోకు...' మద్యానికి బానిసై జీవితాలను నాశనం చేసుకుంటున్న యువతకు ఇలా పలువురు హితబోధ చేసినప్పటికీ యువతలో మాత్రం మార్పు రావడంలేదు. నిత్యం బెల్టుషాపుల చుట్టూ తిరుగుతూ జీవితాలను పోగొట్టుకుంటున్నారు. ఇటీవల బెల్టుషాపుల సంఖ్య మరింతగా పెరగడంతో మద్యం సేవించేవారి సంఖ్య పెరుగుతూ పోతోంది. రోజువారీ కూలీలు పనులు చేసుకోవడం మానేసి పొద్దస్తమానం బెల్టుషాపుల్లోనే కాలం గడుపుతున్నారు. అంతేకాకుండా రోజంతా కష్టపడగా వచ్చిన కూలీ డబ్బులను సైతం బెల్టుషాపుల్లో ఖర్చుచేస్తూ ఆరోగ్యాలను పాడుచేసుకుంటున్నారు. ఇటీవల మద్యం సేవించి అనారోగ్యాలపాలవడమే కాకుండా ప్రాణాలను సైతం పోగొట్టుకుంటున్నవారి సంఖ్య పెరుగుతూపోతోంది.

*** నియంత్రణలేని బెల్టుషాపులతో ఆగమాగం..**

ఇటీవల కొత్తగా మద్యం టెండర్లు దక్కించుకున్నవారు వైన్ షాపులను దేవాలయాలు, విద్యాలయాలకు సమీపంలో షాపులు ఏర్పాటు చేయడం గమనార్హం. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో ఈ పరిస్థితి నెలకొంది. జిల్లా కేంద్రమైన కొత్తగూడెం పట్టణం, రామవరం ప్రధాన కూడిలి కేంద్రాల్లో ఉన్న వైన్‌షాపులకు సమీపంలోనే విద్యాలయాలు ఉన్నప్పటికీ పట్టించుకునేవారు లేకుండాపోయారు. నిబంధనలను అమలు చేయాల్సిన ఎక్సైజ్ శాఖాధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు బలంగా విన్పిస్తున్నాయి. మద్యానికి బానిసై కుటుంబాలు రోడ్డున పడుతున్నా సంబంధిత శాఖలు మాత్రం కళ్లప్పగించి చూస్తున్నాయనే విమర్శలు ఉన్నాయి. ఎన్నికల ముందు బెల్ట్ షాపులు ఎత్తేస్తామని హామీలు ఇచ్చిన నాయకులు... ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తవుతున్నా చర్యలు శూన్యమని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గల్లీల్లో ఏర్పాటు చేసిన బెల్ట్ షాపుల కారణంగా మద్యంప్రియులు మద్యానికి బానిసవడమే కాకుండా నిత్యం అల్లర్లు, గొడవలతో ప్రశాంతంగా ఉన్న బస్తీలను సైతం రెడ్‌జోన్ ఏరియాలుగా మార్చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. సింగరేణి కార్మిక ప్రాంతం కావడంతో నడిరోడ్డుపైనే మద్యం సేవించడం, వాహనాలు అడ్డంగా నిలిపివేయడం, ప్రశ్నించిన వారితో గొడవలకు దిగడం సర్వసాధారణంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. రామవరం మెయిన్ రోడ్డు నుంచి శివాలయానికి వెళ్లే దారిలో భక్తులు తలదించుకుని వెళ్లాల్సి వస్తోంది.

**– కల్తీ మద్యం కారణమా...?**

రామవరం ప్రాంతానికి చెందిన మిర్చి బండి వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న పవన్ కోరి (పవన్) మద్యానికి బానిసై ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. వైద్య పరీక్షల్లో లివర్, కిడ్నీలు పూర్తిగా దెబ్బతిన్నాయని వైద్యులు నిర్ధారించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. చేసేది లేక గాంధీ ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేయించి ఇంటికి తీసుకొచ్చిన కొద్ది రోజులకే మంగళవారం రాత్రి పవన్ మృతి చెందాడు. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు బోరున విలపించగాం మద్యం మహమ్మారి మరో కుటుంబాన్ని కబళించిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే బెల్టుషాపుల్లో విక్రయించే మద్యం కల్తీ అయి ఉంటుందేమోనని పలువురు మద్యంప్రియులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల వరుసగా పలువురు మద్యం సేవించినవారు అనారోగ్యాలకు గురికావడం ఈ విషయానికి బలాన్ని చేకూరుస్తోంది. గతంలో రామవరం మెయిన్ సెంటర్‌లో మూడు వైన్ షాపులు ఉండగా, ప్రస్తుతం కొత్త మద్యం పాలసీ ప్రకారం రెండు వైన్ షాపులతో పాటు లెక్కలేనన్ని బెల్ట్ షాపులు కొనసాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎక్సైజ్ అధికారులు అప్పుడప్పుడు దాడులు చేసి వెళ్లిపోతున్నారే తప్ప శాశ్వత పరిష్కారం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీస్ శాఖ కూడా ఫిర్యాదు చేస్తే వచ్చి వెళ్లిపోతుందే తప్ప కఠిన చర్యలు తీసుకోవడం లేదని అంటున్నారు. మరికొంతమంది ప్రాణాలు పోకముందే ఎక్సైజ్, పోలీస్ శాఖాధికారులు స్పందించి రామవరంలోని బెల్టుషాపులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# స్నోమ్యాన్... శాంటా హ్యాట్.. అన్నీ అలంకరణలే!

**క్రిస్మస్... పిల్లలకి ఎంతో ఇష్టమైన పండుగ! అంతేనా ఆరోజు క్రిస్మస్ ట్రీని అలంకరిస్తే రాత్రి శాంటాక్లాజ్ వచ్చి బహుమతులు ఇస్తాడంటూ సంబరపడిపోతారు. అందుకే మతాలకతీతంగా చాలామంది ముఖ్యంగా పిల్లలున్నవాళ్లు క్రిస్మస్‌కి రంగురంగుల దీపాలతో ఇంటిని అలంకరిస్తుంటారు. బదులుగా ఈసారి ఇలా చేసి చూడండి... ఎవరైనా ఇంటికి రాగానే స్వాగతం పలికేది ముందున్న ద్వారమే కదా. దానికి స్నోమ్యాన్, శాంటా హ్యాట్‌లు సరిగ్గా సరిపోతాయి. వీటిని తలుపునకు వేలాడదీస్తే సరి. ఇంటికొచ్చే స్నేహితులు, బంధువులు కలిసి భోజనం చేయాలంటే అంతా చేరిపోయేది డైనింగ్ టేబుల్ దగ్గరకే! అక్కడ పైన్ కోన్ షాండ్లియర్లు, రంగురంగుల గొడుగులకు ఫెయిరీ లైట్లు, క్యాండీ కేన్స్, కలర్ బంతులను వేలాడదీస్తే ఇంటికి పార్టీ లుక్ వచ్చేస్తుంది. కిటికీలు, అల్మారాలకు క్రిస్మస్ గ్లౌజుల్ని హ్యాంగ్ చేస్తే కొత్తగా కనిపిస్తాయి. పైన్ కోన్లను గాజు గ్లాసుల్లో వేసి ఎల్ఈడీ లైట్లతో టీపాయ్ మీద పెడితే వచ్చినవారిని ఇట్టే ఆకర్షిస్తాయి. ఆ రోజు బహుమతులు ఇచ్చిపుచ్చుకోవడం తెలిసిందే. ఈసారి చక్కగా శాంటాక్లాజ్‌తో తయారైన గిఫ్ట్ బ్యాగులు ఇచ్చి చూడండి. అందరి ముఖాల్లోనూ ఆనందం వెల్లివిరియడం ఖాయం!**











# అధికారుల నిర్లక్ష్యాన్ని సహించం: డిప్యూటీ సీఎం భట్టి

ఖమ్మం: రాష్ట్ర ప్రగతిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వాధికారులు, ఉద్యోగులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చామని, ఇకపై నిర్లక్ష్యాన్ని ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం ఖమ్మం కలెక్టర్ కార్యాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ''మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా రాష్ట్రం ఎదిగేందుకు 2047 విజన్ డాక్యుమెంట్ రూపొందించాం. మానవ సంపద సృష్టించడం కీలకం. తద్వారా రాష్ట్రానికి పెద్ద ఎత్తున సంపద సమకూరుతుంది. విలువైన మానవ వనరులను సృష్టించేందుకు విద్యారంగంపై ప్రభుత్వం పెద్ద ఎత్తున పెట్టుబడులు పెడుతోంది. విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచాం, న్యూట్రిషన్ ఫుడ్ ద్వారా వారికి మంచి ఆరోగ్యం అందించి విలువైన మానవ వనరులు సృష్టించాలనేది ప్రజా ప్రభుత్వం లక్ష్యం. ప్రభుత్వ, జిల్లా పరిషత్, రెసిడెన్షియల్ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు




కల్పిస్తున్నాం. జిల్లా కలెక్టర్ మొదలు అధికారులు అందరూ విద్యాసంస్థలను పర్యవేక్షించి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. ఈ కార్యక్రమం పక్కాగా జరిగితే అద్భుతమైన ఫలితాలు సాధిస్తాం. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో ఏదైనా ఘటన జరిగితే అందుకు ఇన్‌ఛార్జి అధికారిని బాధ్యునిగా చేస్తాం. గోదాముల్లో వస్తువులను కుక్కినట్టుగా ప్రైవేట్ విద్యాసంస్థల్లో విద్యార్థులను నమోదు చేసుకుంటున్నారు. ఇక నుంచి ప్రైవేటు విద్యాసంస్థలకు ఉండాల్సిన అర్హతలు, సౌకర్యాలపై ఒక చెక్ లిస్ట్ పెట్టుకొని అవన్నీ ఉంటేనే అధికారులు అనుమతులు ఇవ్వాలి. సౌకర్యాలు లేని విద్యాసంస్థలను అప్‌గ్రేడ్ చేసుకోవాలని వెంటనే తెలియజేయండి'' అని డిప్యూటీ సీఎం అన్నారు.



## తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు.. నోటిఫికేషన్ జారీ చేసిన గవర్నర్

హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ, కౌన్సిల్ సమావేశాలకు గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ నోటిఫికేషన్ జారీ చేశారు. ఈనెల 29న ఉదయం 10.30గంటలకు అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. కృష్ణా, గోదావరి జలాలపై అసెంబ్లీ సమావేశాల్లో చర్చించే అవకాశముంది. ప్రాజెక్టులు, నీటి కేటాయింపులు, రాష్ట్ర విభజన తర్వాత ప్రాజెక్టులపై చేసిన వ్యయం ఇలా అన్ని అంశాలపై సమగ్రంగా చర్చించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి యోచిస్తున్నట్లు సమాచారం.

## వ్యక్తి అనుమానాస్పద మృతి.. ఆర్ఎంపీ బైక్‌ను తగులబెట్టిన స్థానికులు

కేసముద్రం: మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం బోడమంచతండాలో ఉద్రిక్తత నెలకొంది. మంగళవారం ఆ గ్రామంలో భూక్యా వీరన్న (45) అనుమానాస్పద రీతిలో మృతి చెందాడు. అతడిని హత్య చేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించారని స్థానికులు ఆరోపించారు. వీరన్న మృతికి ప్రతీకారంగా బుధవారం ఉదయం తండావాసులు ఆందోళనకు దిగారు. అనుమానితులుగా భావిస్తూ ఆర్ఎంపీ భరత్, బోడ బాలు ఇళ్ల ముట్టడికి వెళ్లారు. ఈ క్రమంలో ఆర్ఎంపీ బైక్, ఓ షాపును తగులబెట్టారు. బాలు ఇంటిని ధ్వంసం చేస్తుండగా పోలీసులు అక్కడికి చేరుకొని ఆందోళనకారులను అడ్డుకున్నారు. దీంతో తండా వాసులు, పోలీసుల మధ్య



తోపులాట జరిగింది. ఈ ఘటనలో ఇద్దరు పోలీసులకు గాయాలయ్యాయి. వారిని ఆస్పత్రికి తరలించారు. అనుమానితులతో పాటు మృతుడి



భార్యను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో బోడమంచతండాలో భారీగా పోలీసులు మోహరించారు.

## రేపు క్రిస్మస్ పండుగ.. సీఎం రేవంత్ స్పెషల్ విషెస్

క్రిస్మస్ పర్వదినం సందర్భంగా సీఎం ఎ.రేవంత్‌రెడ్డి క్రిస్టియన్లకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రమంతటా క్రిస్మస్ వేడుకలను ఆనందంగా జరుపుకోవాలని సూచించారు. ఏసు ప్రభువు బోధనలను అనుసరించి అన్ని మతాల సంక్షేమం, అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని తెలిపారు. క్రిస్టియన్ మైనారిటీల సర్వతోముఖాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని పేర్కొన్నారు. ఏసుక్రీస్తు బోధనలు ఇప్పటికీ ఎప్పటికీ ప్రపంచంలోని మానవాళికి మార్గదర్శకమని వెల్లడించారు. అన్ని మతాల సారాంశం మానవత్వమేనని.. ఆయన ఎంచుకున్న మార్గం ఆదర్శనీయమని పేర్కొన్నారు.

**యాదగిరిగుట్టకు రండి..**

ఈ నెల 30న వైకుంఠ ఏకాదశి సందర్భంగా యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి పుణ్యక్షేత్రాన్ని దర్శించాల్సిందిగా ఆలయ ప్రతినిధులు




సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ఆహ్వానించారు. ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌తోపాటు ఆలయ అర్చకులు సీఎంను వారి నివాసంలో కలిసి ఆహ్వానించారు.

## జీహెచ్‌ఎంసీ చట్టానికి సవరణ.. హైకోర్టు నోటీసులు

హైదరాబాద్: జీహెచ్‌ఎంసీ చట్టానికి సవరణ తీసుకొస్తూ జారీ చేసిన ఆర్డినెన్స్‌పై వివరణ ఇవ్వాలంటూ ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. దీనిపై నాలుగు వారాల్లో కౌంటరు దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది. తుక్కుగూడ మున్సిపాలిటీతో పాటు మరికొన్నింటిని జీహెచ్‌ఎంసీలో విలీనం నిమిత్తం జీహెచ్‌ఎంసీ చట్టానికి సవరణ తీసుకువస్తూ జారీ చేసిన ఆర్డినెన్స్ 9, 10, 11లను సవాలు చేస్తూ పిటిషన్ దాఖలు అయింది. తుక్కుగూడకు చెందిన బరిగెల రాజు ఈ పిటిషన్ వేశారు. దీనిపై సీజే ధర్మాసనం విచారణ చేపట్టింది. ప్రభుత్వం



జారీ చేసిన ఆర్డినెన్స్ ద్వారా తుక్కుగూడ జీహెచ్‌ఎంసీలో విలీనమైందని పిటిషనర్ తరపు సీనియర్ న్యాయవాది ఎల్ రవిచందర్ కోర్టుకు తెలిపారు. వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో పిటిషనర్ పోటీ చేయాలనుకుంటున్నారని, అయితే విలీనం నేపథ్యంలో హద్దులు మారడంతోపాటు ఇతరత్రా ప్రభావం పడుతుందన్నారు. నోటిఫికేషన్‌కు ముందు మున్సిపల్ కార్పొరేషన్‌తో సంప్రదింపులు లేవని, ఇది పారదర్శకంగా లేదన్నారు. వాదనలను విన్న ధర్మాసనం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, న్యాయశాఖ, పురపాలక పట్టణాభివృద్ధి శాఖలకు నోటీసులు జారీ చేసింది. 4 వారాల్లో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది.

## పతంగుల పండగకు చెరువులను సిద్ధం చేయాలి.. హైడ్రా కమిషనర్ రంగనాథ్

పతంగుల పండగ నాటికి చెరువులను సిద్ధం చేయాలని హైడ్రా కమిషనర్ ఏవీ.రంగనాథ్ ఆదేశించారు. సంక్రాంతి సందర్భంగా జనవరి 13 నుంచి 15 వరకూ రాష్ట్ర ప్రభుత్వం పతంగుల పండగ నిర్వహించడం ఆనవాయితీగా ఉంది. ఈ సారి హైడ్రా అభివృద్ధి చేసిన చెరువుల చెంత కూడా పతంగుల పండగను నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో బుధవారం హైడ్రా కమిషనర్ క్షేత్ర స్థాయిలో అభివృద్ధి పనులను పరిశీలించారు. తమ్మిడికుంట, కూకట్‌పల్లిలోని నల్ల చెరువులను సందర్శించి పలు సూచనలు చేశారు. చెరువులలోకి నేరుగా మురుగు నీరు చేరకుండా ఎస్‌టీపీ (సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంటు)ల ద్వారా శుద్ధి జలాలు వచ్చేలా ఏర్పాటు వెంటనే చేపట్టాలని సూచించారు. ఎస్టీపీలను ఏర్పాటుచేసిన ప్రాంతంలో పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా చూడాలన్నారు. ఇందుకు చెరువు చెంత ఉన్న ప్రభుత్వ భూమిని వినియోగించుకోవాలన్నారు. పార్కుల అభివృద్ధితో పాటు గ్రీనరీని పెంచాలని సూచించారు. ప్రతి చెరువును ఒక పర్యాటక ప్రాంతంలా అభివృద్ధి చేయాలన్నారు. వయసుమళ్లిన వారు సేదదీరే విధంగా కూర్చునే వెసులుబాటుతో పాటు నీడ కల్పించాలని.. చిన్నారులు ఆడుకునేందుకు ప్లే ఏరియాలను అభివృద్ధి చేయాలని హైడ్రా కమిషనర్ సూచించారు.

**పతంగుల పండుగకు ఏర్పాట్లు..**

పతంగుల పండుగ ఆహ్లాదకర వాతావరణంలో



జరిగేందుకు జీహెచ్‌ఎంసీ, పర్యాటకంతో పాటు.. వివిధ ప్రభుత్వ శాఖలతో సమన్వయంగా పని చేయాల్సిన అవసరాన్ని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అధికారులకు సూచించారు. చెరువుల చెంత భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని.. తాగునీటి వసతితో పాటు మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే చెరువులను సందర్శించేందుకు వచ్చిన వాహనదారులు ఇబ్బందులు పడకుండా సులభంగా వచ్చి వెళ్లేలా ఏర్పాట్లు చేస్తున్న పార్కింగ్ సౌకర్యాన్ని కమిషనర్ పరిశీలించారు. చెరువుల పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నందున.. అక్కడ దుమ్ము, ధూళి ఎగరకుండా నీళ్లు చిలకరించాలన్నారు. వర్షాకాలం పూర్తి అయిన తర్వాత రూపొందుతున్నందున చెరువుల్లో నీటిని నింపేందుకు ఎస్టీపీలను వెంటనే ఏర్పాటు చేయాలని సూచించారు. మూసీ నది ప్రక్షాళనను ప్రభుత్వం చేపడుతున్న వేళ.. చెరువుల మంచినీరు మూసీలో చేరేలా చూడాలన్నారు. ఇన్‌లెట్‌లు, ఔట్‌లెట్ల నిర్మాణంతో పాటు.. పరిసర ప్రాంతాల నుంచి వర్షపు నీరు సులభంగా చెరువులోకి చేరేలా ఛానల్స్‌ను అభివృద్ధి చేయాలని సూచించారు.

**సంబురాలకు వేదికలుగా చెరువులు**

మురుగు నీటితో దుర్గంధభరిత వాతావరణంలో ఆక్రమణలకు గురై ఆనవాళ్లు కోల్పోయిన చెరువులను హైడ్రా అభివృద్ధి చేయడంతో సంబురాలకు వేదికలు అవుతున్నాయి. ఇటీవల బతుకమ్మ ఉత్సవాలకు అంబర్‌పేటలోని బతుకమ్మ కుంట వేదికైతే.. నేడు సంక్రాంతి సంబరాలకు బతుకమ్మకుంటతో పాటు.. మాధాపూర్‌లోని తమ్మిడికుంట, కూకట్‌పల్లిలోని నల్ల చెరువు, పాతబస్తీలోని బమ్‌రుక్నుఉద్‌దౌలా వేదికలౌతున్నాయి. హైడ్రా మొదటి విడతగా చేపట్టిన ఆరు చెరువుల పునరుద్ధరణలో ఉప్పల్‌లోని నల్లచెరువు, మాదాపూర్‌లోని సున్నం చెరువు ఇంకా అభివృద్ధి చెందాల్సి ఉంది. పతంగుల పండుగకు చెరువులు వేదికలౌతుండడం పట్ల నగర ప్రజలు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆక్రమణలతో కనుమరుగు అవుతున్నాయని అనుకున్న చెరువులు రూపు రేఖలను మార్చుకుని విస్తరణకు నోచుకున్నాయని ఆనందం వ్యక్తం చేశారు. మొదటి విడత చేపట్టిన ఆరు చెరువులు హైడ్రా పనులు చేపట్టక ముందు 105 ఎకరాలుంటే.. ఇప్పుడు 180 ఎకరాలకు విస్తీర్ణం పెరిగాయన్నారు. నగరం నడిబొడ్డున 75 ఎకరాల ఆక్రమణలు తొలగించి చెరువులను అభివృద్ధి చేయడం సాధారణమైన విషయం కాదని పలువురు ప్రశంసించారు.

## 2028లో తెలంగాణ ప్రజలు కాంగ్రెస్‌ను బొంద పెట్టడం ఖాయం: కేటీఆర్

హైదరాబాద్: 2028లో తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టడం ఖాయమని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. కోస్గి సభలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ మండిపడ్డారు. నీటి ద్రోహంపై జవాబు చెప్పలేక నికృష్టపు మాటలు మాట్లాడుతున్నారని 'ఎక్స్' వేదికగా ధ్వజమెత్తారు. ''జల హక్కులను కాపాడటం రేవంత్‌రెడ్డికి చేతకాదు. పాలమూరు ప్రాజెక్టు గొంతుకోసి.. సొంత జిల్లానే దగా చేస్తున్నారు. తెలంగాణ సోయిలేని.. రాష్ట్ర ప్రయోజనాలు రక్షించలేని వ్యక్తి రేవంత్‌రెడ్డి. శాసన సభలో.. జనసభలో ప్రతిచోటా కాంగ్రెస్



జలద్రోహాన్ని ఎండగడతాం. జనం అన్నీ గమనిస్తున్నారు.. సందర్భం వచ్చినప్పుడు తొక్కి నారతీస్తారు'' అని కేటీఆర్ అన్నారు.

## 'సృష్టి' కేసులో బెయిల్‌పై వచ్చి.. చిన్నారులను విక్రయిస్తున్న ముఠా అరెస్ట్



హైదరాబాద్: చిన్నారుల అక్రమ రవాణాకు పాల్పడుతున్న ముఠాను మాదాపూర్ ఎస్‌వోటీ పోలీసులు అరెస్టు చేశారు. వివరాలను మాదాపూర్ డీసీపీ రితు రాజ్ మీడియా సమావేశంలో వెల్లడించారు. ''గుజరాత్ నుంచి చిన్నారులను తీసుకొచ్చి హైదరాబాద్, మంచిర్యాలలో విక్రయించారు. దాదాపు 20 మంది ముఠా సభ్యులను అదుపులోకి తీసుకున్నాం. ముఠాలో సృష్టి ఫెర్టిలిటీ కేసుకు సంబంధించిన నిందితులు ఉన్నట్టు గుర్తించాం. సృష్టి కేసులో బెయిల్‌పై వచ్చి చిన్నారులను విక్రయిస్తున్నారు. ఒక్కో చిన్నారిని రూ.4లక్షల నుంచి రూ.5 లక్షలకు విక్రయిస్తున్నట్టు దర్యాప్తులో తేలింది'' అని డీసీపీ తెలిపారు.

## నేతన్న జీవితాలతో సర్కార్ చెలగాటం.. ప్రభుత్వంపై ఎమ్మెల్సీ కవిత ఆగ్రహం

మగ్గాన్నే నమ్ముకున్న చేనేత కార్మికులు తీవ్ర సంక్షోభంలో పడ్డారని తెలంగాణ జాగృతి చీఫ్, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇవాళ ఆమె నేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ భూదాన్ పోచంపల్లిలో స్థానిక చేనేత కార్మికులతో కలిసి ధర్నాలో పాల్గొన్నట్లుగా సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'X' (ట్విట్టర్) వేదికగా పేర్కొన్నారు. మగ్గాన్ని నమ్ముకుని జీవనోపాధి పొందుతున్న వీరి జీవితాలతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటమాడుతోందని ఆమె తీవ్ర ఆరోపణలు చేశారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూలు సబ్సిడీ, థ్రిఫ్ట్ స్కీం, నేతన్నకు చేయూత వంటి ముఖ్యమైన పథకాలను కొనసాగించకుండా ప్రస్తుత ప్రభుత్వం నేతన్న నడ్డి విరిచిందని ఆరోపించారు. అంతేకాకుండా, చేనేత కార్మికుల రుణమాఫీ కోసం రూ.33 కోట్లు విడుదల చేశామని ప్రభుత్వం ప్రకటించినా.. కొందరికి మాత్రమే రుణమాఫీ అయిందని.. కానీ వారు లక్షల్లో ఉన్నారని అన్నారు. ఈ రేవంత్ సర్కారుకు చేనేత కార్మికుల అభివృద్ధిపై ఏ మాత్రం చిత్తశుద్ధి లేదన్నారు. నూలు సబ్సిడీ, థ్రిఫ్ట్ స్కీం, నేతన్నకు




చేయూత వంటి పథకాలను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు.

# భాజపా విధానాలతో చిరు వ్యాపారులకు దెబ్బ : రాహుల్ గాంధీ

భాజపా ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు చిన్న వ్యాపారాలు చేసేవారిని.. ముఖ్యంగా వైశ్య వర్గాన్ని దెబ్బతీస్తున్నాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఆ వర్గానికి తాను మద్దతుగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా భాజపా మనస్తత్వానికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. వైశ్య వర్గానికి చెందిన వ్యాపారులతో రాహుల్ భేటీ అయ్యి మాట్లాడారు. చర్చల అనంతరం వారి సమస్యలపై రాహుల్ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. 'మా వ్యాపారం పతనానికి దగ్గరగా ఉంది.. అంటూ వైశ్య సమాజం నుంచి వచ్చిన ఆవేదన నన్ను తీవ్రంగా కలచివేసింది. దేశ ఆర్థిక వ్యవస్థకు



ఎంతో దోహదపడిన సమాజం.. నేడు ఇలా నిరాశలో కూరుకుపోవడం ఓ హెచ్చరిక లాంటిది. గుత్తాధిపత్య సంస్థలకు స్వేచ్ఛనిచ్చి.. చిన్న, మధ్యతరహా వ్యాపారులపై అధికారం, జీఎస్టీ వంటి విధానాలతో ప్రభుత్వం భారం మోపుతోంది. ఇది కేవలం విధాన వైఫల్యం మాత్రమే కాదు. ఉత్పత్తి, ఉపాధితో పాటు భారత భవిష్యత్తు పైనా ప్రత్యక్ష దాడి' అని ఆరోపించారు. భాజపా ప్రభుత్వ మనస్తత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేయాలని రాహుల్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ పోరాటంలో దేశ వాణిజ్యానికి వెన్నెముక అయిన వైశ్య వర్గానికి తాను మద్దతుగా నిలబడతానన్నారు.



## పార్లమెంటు ప్రాంగణంలో ఆ వస్తువుల వినియోగం వద్దు..! ఎంపీలకు సూచన

దిల్లీ: ఎంపీలకు లోక్‌సభ సెక్రటేరియట్ కీలక సూచనలు చేసింది. స్మార్ట్ కళ్లద్దాలు, పెన్ కెమెరాలు, స్మార్ట్ వాచ్‌ల వంటి డిజిటల్ పరికరాలను ఉపయోగించవద్దని విజ్ఞప్తి చేసింది. వాటి వినియోగంతో ఎంపీల ప్రైవసీకి భంగం వాటిల్లే, వారి హక్కులు ఉల్లంఘనకు గురయ్యే అవకాశం ఉందని పేర్కొంది. ''స్మార్ట్ కళ్లద్దాలు, పెన్ కెమెరాలు, స్మార్ట్ వాచ్‌ల వంటి అధునాతన పరికరాలు ఇప్పుడు విస్తృతంగా అందుబాటులో ఉన్నాయి. ఈ నేపథ్యంలో పార్లమెంటు ప్రాంగణంలో ఎంపీల భద్రత, అధికారాలు, ప్రైవసీకి భంగం కలిగించే విధంగా అటువంటి పరికరాలను ఉపయోగించవద్దు'' అని లోక్‌సభ సెక్రటేరియట్ తన బులెటిన్‌లో తెలిపింది.

## డిజిటల్ అరెస్టు పేరిట..
# 85ఏళ్ల వృద్ధుడికి రూ.9 కోట్లకు టోకరా!

డిజిటల్ అరెస్టు పేరిట 85 ఏళ్ల వృద్ధుడి నుంచి సైబర్ నేరగాళ్లు రూ.9 కోట్ల మేర కాజేశారు. ఈ కేసు మహారాష్ట్రలో వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముంబయికి చెందిన ఓ వ్యక్తి (85) ఇంజినీరింగ్ కళాశాలలో హెచ్‌వోడీగా పనిచేసి రిటైరయ్యారు. నవంబరు 28న ఓ గుర్తుతెలియని వ్యక్తి ఆయనకు ఫోన్ చేసి.. తనను తాను ఇన్‌స్పెక్టర్‌గా పరిచయం చేసుకున్నాడు. ఓ బ్యాంకులో ఖాతా తెరిచేందుకు బాధితుడి పేరు, ఆధార్ ఉపయోగించినట్లు చెప్పాడు. ఆ ఖాతాను మనీలాండరింగ్ కోసం, నిషేధిత సంస్థ 'పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా' (పీఎఫ్ఐ) ఆర్థిక లావాదేవీల కోసం ఉపయోగించినట్లు నమ్మబలికాడు. దీనిపై కేసు నమోదు చేస్తున్నామని, సీబీఐ క్రైం బ్రాంచ్ సిట్ విచారణ జరుపుతోందటూ బెదిరించాడు. ఈ క్రమంలో డిసెంబరు 1న వృద్ధుడి వాట్సప్ నంబర్‌కు ఓ వీడియో కాల్ వచ్చింది. పోలీసు యూనిఫాంలో కనిపించిన ఓ వ్యక్తి.. మీ పేరిట అరెస్టు వారెంటు జారీ అయ్యిందని, డిజిటల్ అరెస్టు చేసినట్లు చెప్పాడు. దీని గురించి ఎవరికి చెప్పొద్దని బెదిరించి.. ఆయన బ్యాంకు ఖాతాలు, పెట్టుబడుల వివరాలు సేకరించాడు. సేవింగ్స్, పెట్టుబడి నిధులను వివిధ బ్యాంకు ఖాతాలకు బదిలీ చేయాలన్నాడు. వెరిఫికేషన్ అనంతరం డబ్బును వడ్డీతో సహా తిరిగి ఇస్తామని నమ్మించాడు. దీంతో డిసెంబర్ 1 22వ తేదీ మధ్య సమయంలో మొత్తంగా రూ.9 కోట్లు బదిలీ చేసినట్లు బాధితుడు పోలీసులకు తెలిపారు.



డబ్బు బదిలీ అయ్యాక తనకు ఫోన్లు రావడం ఆగిపోవడం, తాను సంప్రదించేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో.. మోసపోయానని గ్రహించిన బాధితుడు సైబర్ పోలీసులను ఆశ్రయించడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది.



## తప్పుతాగి రైలుపట్టాలపై ఆటో నిలిపి..
# వందేభారత్‌కు త్రుటిలో తప్పిన ప్రమాదం

కేరళలో వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కు తృటిలో ప్రమాదం తప్పింది. ట్రాక్‌పై ఓ ఆటో ఆగి ఉండడాన్ని గమనించిన లోకోపైలట్ అప్రమత్తంగా వ్యవహరించడంతో ప్రయాణికులకు ప్రాణాపాయం తప్పింది. తిరువనంతపురంలోని అకతుమురి హాల్ట్ స్టేషన్ సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. రైల్వే అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం రాత్రి 10.10 గంటలకు అకతుమురి హాల్ట్ స్టేషన్‌ను వందేభారత్ రైలు దాటుతున్న సమయంలో రైల్వే ట్రాక్‌పై ఓ ఆటో ఆగి ఉండడాన్ని లోకోపైలట్ గుర్తించారు. వెంటనే అత్యవసర బ్రేకులు వేసి, రైలును ఆపివేశారు. అయితే రైలు వేగంగా వస్తున్నందువల్ల ఆటోను ఢీకొనింది. అనంతరం ఘటనా స్థలానికి చేరుకున్న రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సిబ్బంది, స్థానిక పోలీసులు ఆటోను పట్టాలపై నుంచి తొలగించారు. ట్రాక్ భద్రతను నిర్ధరించిన అనంతరం రాత్రి 11.15 గంటలకు వందే భారత్ సేవలు తిరిగి ప్రారంభమయ్యాయి. సుధి అనే ఆటో డ్రైవర్ మద్యం మత్తులో తన ఆటోను పట్టాలపై నిలిపివేసి, అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించామని పోలీసులు పేర్కొన్నారు. అతడిని అరెస్టు చేసి, విచారిస్తున్నామన్నారు.

## అత్యాచార బాధితురాలి పట్ల ఇంత దారుణమా? రాహుల్ గాంధీ

ఉన్నావ్ అత్యాచార కేసులో దోషిగా తేలి, జీవిత ఖైదు అనుభవిస్తున్న కుల్దీప్ సెంగర్ శిక్షను దిల్లీ న్యాయస్థానం నిలిపివేయడంపై బాధిత కుటుంబం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ఆదేశాలను సుప్రీం కోర్టులో సవాలు చేస్తామని పేర్కొంది. సెంగర్ బెయిల్‌ను వ్యతిరేకిస్తూ బాధితురాలు, ఆమె తల్లి నిరసన చేస్తున్న క్రమంలో వారితో భద్రతా సిబ్బంది వ్యవహరించిన తీరు విమర్శలకు కారణమైంది. పోలీసులు బాధితురాలిని లాక్కెళ్తున్న దృశ్యాలు వైరల్‌గా మారాయి. పోలీసుల తీరుపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సహా సామాజిక కార్యకర్తలు తీవ్ర స్థాయిలో





మండిపడుతున్నారు.

**బాధితురాలి పట్ల ఇంత దారుణమా?**

ఉన్నావ్ బాధితురాలి నిరసనకు సంబంధించిన ఓ వీడియోపై స్పందించిన రాహుల్ గాంధీ.. తనకు అన్యాయం జరిగిందంటూ నిరసన చేస్తున్న ఓ అత్యాచార బాధితురాలి పట్ల ఇలా వ్యవహరించడం సమంజసమేనా..?న్యాయం కోసం గళం వినిపించడమే ఆమె చేసిన తప్పా..? అని ప్రశ్నించారు. అత్యాచార నిందితులకు బెయిల్ రావడం, బాధితులను నేరస్థులుగా చూడటం ఏ రకమైన న్యాయమని నిలదీశారు. ఇటువంటి అమానవీయ సంఘటనలతో మనం కూడా నిర్జీవ సమాజంగా మారుతున్నామన్నారు.

**సుప్రీంలో సవాలు చేస్తాం..**

తమ కుటుంబ సభ్యులు, న్యాయవాదులు, సాక్షుల భద్రతను ఇప్పటికే ఉపసంహరించుకున్నారని.. తాజా పరిణామాలు తమ భయాలను మరింత పెంచాయని ఉన్నావ్ అత్యాచార బాధితురాలు మీడియాతో పేర్కొన్నారు. ఇలాంటి కేసుల్లో దోషికి ఇలా బెయిల్ వస్తే.. దేశ మహిళలు సురక్షితంగా ఎలా ఉంటారని ప్రశ్నించారు. సెంగర్‌కు బెయిల్ లభించడం తమకు మరణం కంటే తక్కువేం కాదన్నారు. డబ్బు లేనివారికి ఎప్పుడు ఓటమేననే విషయాన్ని ఈ పరిణామం నిరూపిస్తోందని విలపించారు.

## ఉద్యోగులకు గిఫ్ట్‌గా కార్లు.. 'ధురంధర్'లుగా మారాలని పిలుపు

చండీగఢ్: చండీగఢ్‌కు చెందిన ఓ వ్యాపారవేత్త తన సంస్థలో పనిచేసే ఉద్యోగులకు సర్‌ప్రైజ్ ఇచ్చారు. ఈ ఏడాది దీపావళి సందర్భంగా 51 మంది సిబ్బందికి కార్లు బహుమతిగా ఇచ్చిన ఆయన.. తాజాగా క్రిస్మస్, నూతన సంవత్సరం వేళ మరికొందరికి కానుకలు అందజేశారు. మరో ఆరుగురికి కొత్త కార్ల తాళాలు అప్పగించారు. ఆయనే 'మిట్స్ నేచురా లిమిటెడ్' ఔషధ తయారీ సంస్థ యజమాని ఎం.కె.భాటియా. కార్ల అందజేత సందర్భంగా భాటియా మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ తమ రంగాల్లో 'ధురంధర్' (నిపుణులు)లుగా మారాలని పిలుపునిచ్చారు. నిరంతర అభ్యాసం, ఆత్మవిశ్వాసం, నిజాయతీతో వృత్తిలో రాణించాలని సూచించారు. వ్యాపార వృద్ధి



ముఖ్యమే అయినప్పటికీ.. సమాజానికి సానుకూల సందేశాన్ని ఇవ్వడం సంస్థ లక్ష్యమని పేర్కొన్నారు. భాటియా కొన్నేళ్లుగా దీపావళి సందర్భంగా ఉద్యోగులకు కొత్త కార్లను గిఫ్ట్‌గా ఇస్తున్నారు.

## మూడు రోజుల్లోనే అలర్జీ వచ్చింది

**: నితిన్ గడ్కరీ కీలక వ్యాఖ్యలు**

దిల్లీ కాలుష్యంపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆందోళన వ్యక్తంచేశారు. ఇక్కడ ఉన్న మూడు రోజుల్లోనే తనకు అలర్జీ వచ్చిందని వెల్లడించారు. దేశ రాజధానిలో జరిగిన ఒక పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ''నేను ఇక్కడ మూడు రోజులుగా ఉంటున్నాను. ఈ కాలుష్యం వల్ల నాకు అలర్జీ వచ్చింది. నేను రవాణా శాఖ మంత్రిగా ఉన్నాను. 40 శాతం కాలుష్యానికి కారణం రవాణారంగమే. శిలాజ ఇంధనాల వాడకాన్ని గణనీయంగా తగ్గించాల్సిన అవసరం ఉంది. శిలాజ ఇంధనాలు పరిమితంగా ఉన్నాయి. కానీ కాలుష్యం మాత్రం పెరిగిపోతోంది. మనం వాటి వాడకాన్ని తగ్గించలేమా..? కాలుష్యాన్ని తగ్గించే ఎలక్ట్రిక్ వాహనాలు, హైడ్రోజన్ ఆధారిత వాహనాలకు ప్రోత్సాహం లభించాలి'' అని గడ్కరీ వ్యాఖ్యలు చేశారు. భారతదేశం శిలాజ ఇంధనాలపై ఏటా దాదాపు రూ.22 లక్షల కోట్లు ఖర్చు చేస్తోంది. కేంద్ర మంత్రి ఇథనాల్ వాడకాన్ని ప్రోత్సహిస్తోన్న సంగతి తెలిసిందే. ప్రముఖ కార్ల తయారీ సంస్థ టయోటా తయారుచేసిన తొలి ఫ్లెక్స్‌ఫ్యూయల్ కారును ఇప్పటికే నితిన్ గడ్కరీ ఆవిష్కరించారు. పెట్రోల్, ఇథనాల్‌ను కలిపి వినియోగించడాన్నే ఫ్లెక్స్‌ఫ్యూయల్



అని పిలుస్తారు. ఇది కాలుష్యాన్ని, శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గిస్తుందని మంత్రి పేర్కొన్నారు. దిల్లీ లో గాలి నాణ్యత రోజురోజుకూ పడిపోతోంది. మంగళవారం అతి తీవ్రస్థాయికి దిగజారింది. బుధవారం ఉదయం కాస్త మెరుగుపడింది. ఇదిలాఉంటే.. గతంలోనూ ఆయన దిల్లీ కాలుష్యం గురించి మాట్లాడారు. ''నేను రెండు లేదా మూడు రోజులు మాత్రమే దిల్లీలో ఉంటాను. ఇక్కడికి వచ్చినప్పుడు ఎప్పుడెప్పుడు వెళ్లిపోదామా అని ఆలోచిస్తుంటా. నేను ముందే రిటర్న్ టికెట్లను బుక్ చేసుకుంటా'' అని వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే.

## గాలి స్వచ్ఛంగా లేదు.. కనీసం ప్యూరిఫైయర్లపై
# జీఎస్టీని తగ్గించలేరా? కేంద్రంపై కోర్టు ఆగ్రహం



దిల్లీ: దేశ రాజధాని దిల్లీ సహా దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో వాయు కాలుష్యం తీవ్రంగా ఉన్న వేళ.. ఎయిర్ ప్యూరిఫైయర్లపై 18శాతం జీఎస్టీ కొనసాగిస్తుండటంపై దిల్లీ హైకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లోనూ వీటిపై జీఎస్టీ తగ్గించే అంశాన్ని ఎందుకు పరిశీలించడం లేదని కేంద్రాన్ని ప్రశ్నించింది. దీనిపై వివరణ ఇవ్వాలని న్యాయస్థానం ఆదేశించింది. ఎయిర్ ప్యూరిఫైయర్లను వైద్య పరికరంగా పరిగణించి.. వాటిని 5శాతం జీఎస్టీ శ్లాబులోకి తీసుకొచ్చేలా ఆదేశాలివ్వాలంటూ దిల్లీ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. దీనిపై విచారణ జరిపిన డివిజన్ బెంచ్ కేంద్రం తీరుపై అసహనం వ్యక్తం చేసింది. ''మనం రోజుకు 21వేల సార్లు శ్వాస తీసుకుంటాం. అలాంటప్పుడు గాలి కాలుష్యం వల్ల ఎంత నష్టం జరుగుతుందో ఓసారి లెక్కించండి'' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ పిటిషన్‌పై స్పందించేందుకు సమయం ఇవ్వాలంటూ ప్రభుత్వం చేసిన అభ్యర్థనపై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తంచేసింది. ''వాయు కాలుష్యం వల్ల వేలాది మంది చనిపోతున్నారు. ప్రతి పౌరుడికి స్వచ్ఛమైన గాలి అవసరం. అది అందించలేనప్పుడు కనీసం ఎయిర్ ప్యూరిఫైయర్లనైనా అందుబాటు ధరల్లో ఉంచాలి కదా. ఇలాంటి ఎయిర్ ఎమర్జెన్సీలో జాతీయ భద్రతా చట్టం కింద తాత్కాలిక చర్యలు చేపట్టలేరా? ఎయిర్ ప్యూరిఫైయర్లపై తక్షణం మినహాయింపులు ఇవ్వలేరా?'' అని ధర్మాసనం కేంద్రాన్ని ప్రశ్నించింది. దీనిపై ఈ రోజే తమ స్పందన తెలియజేయాలని ప్రభుత్వం తరపు న్యాయవాదిని ఆదేశించింది.

# రెండు కొత్త విమానయాన సంస్థలకు అనుమతి..

## త్వరలో అల్ హింద్ ఎయిర్, ఫ్లైఎక్స్‌ప్రెస్ సేవలు



**న్యూఢిల్లీ:** రెండు కొత్త విమానయాన సంస్థలకు కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతి లభించింది. అల్ హింద్ ఎయిర్, ఫ్లైఎక్స్‌ప్రెస్‌కు విమానయాన మంత్రిత్వ శాఖ బుధవారం నో అబ్జెక్షన్ సర్టిఫికేట్లు (ఎన్వోసీ) మంజూరు చేసింది. దీంతో ఈ రెండు విమానయాన సంస్థలతో పాటు ఇప్పటికే ఎన్వోసీ పొందిన శంఖ్ ఎయిర్ కూడా కొత్త ఏడాది నుంచి సేవలు ప్రారంభించనున్నాయి. పౌర విమానయాన మంత్రి కే రామ్మోహన్ నాయుడు ఈ విషయాన్ని బుధవారం వెల్లడించారు. 'భారత విమానయాన రంగంలోకి అడుగుపెట్టాలని ఆకాంక్షిస్తున్న కొత్త విమానయాన సంస్థలు శంఖ్ ఎయిర్, అల్ హింద్ ఎయిర్, ఫ్లైఎక్స్‌ప్రెస్‌ల బృందాలను గత వారం రోజులుగా కలవడం సంతోషంగా ఉంది. శంఖ్ ఎయిర్ ఇప్పటికే మంత్రిత్వ శాఖ నుంచి ఎన్వోసీ పొందింది. అల్ హింద్ ఎయిర్, ఫ్లైఎక్స్‌ప్రెస్ కూడా ఈ వారం ఎన్వోసీలు అందుకున్నాయి' అని ఎక్స్‌లో పేర్కొన్నారు.

కాగా, ఉత్తరప్రదేశ్ కేంద్రంగా శంఖ్ ఎయిర్ కార్యకలాపాలు నిర్వహించనున్నది. అల్ హింద్ ఎయిర్‌ను కేరళకు చెందిన అల్ హింద్ గ్రూప్ ప్రమోట్ చేస్తున్నది. ఈ రెండితోపాటు ఫ్లైఎక్స్‌ప్రెస్ కూడా 2026లో తొలుత దేశీయంగా విమానాలు నడిపేందుకు సిద్ధమయ్యాయి.

మరోవైపు ప్రాంతీయ విమానయాన సంస్థ ఫ్లై బిగ్ అక్టోబర్‌లో విమాన సేవలను నిలిపివేసింది. దీంతో ప్రస్తుతం తొమ్మిది దేశీయ విమానయాన సంస్థలు పనిచేస్తున్నాయి. అయితే ఇండిగో, ఎయిర్ ఇండియా గ్రూప్‌కు చెందిన ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సంస్థల దేశీయ విమానయాన మార్కెట్ వాటా 90 శాతానికి పైగా ఉన్నది.

# ఏఐ ఫీచర్స్‌తో కెనరా బ్యాంక్ కొత్త యాప్..

**ఏఐ 1పే పేరుతో కెనరా బ్యాంక్ కొత్త యాప్**

**ఫాస్ట్ అండ్ సేఫ్‌గా డిజిటల్ లావాదేవీలు**

**గూగుల్ ప్లేస్టోర్, యాపిల్ యాప్ స్టోర్‌లో అందుబాటులో ఉన్న కొత్త యాప్**




**న్యూఢిల్లీ:** ఏఐ ఫీచర్లతో కెనరా బ్యాంక్ నూతన యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో లావాదేవీలను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ యాప్‌ను రూపొందించింది. ఇది గూగుల్ ప్లేస్టోర్, యాపిల్ యాప్ స్టోర్ లలో అందుబాటులో ఉంది. ఇప్పటికే ఇతర యూపీఐ యాప్‌లలో రిజిస్టర్ అయిన కెనరా బ్యాంక్ ఖాతాదారులు సైతం సులభంగా మార్చుకోవచ్చు. కెనరా ఏఐ 1పే పేరుతో కొత్త యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ)ను ప్రారంభించింది.

ఈ యాప్ ద్వారా ఏ బ్యాంకు ఖాతానైనా లింక్ చేసుకొని వేగంగా, సురక్షితంగా డిజిటల్ చెల్లింపులు చేసుకోవచ్చు. వ్యక్తిగత వినియోగదారులతో పాటు వ్యాపారులు, చిన్న దుకాణాలు, స్వయం ఉపాధి వ్యక్తులు సైతం సులభంగా చెల్లింపులు స్వీకరించేందుకు ఇది ఉపయోగపడుతుంది.

ఫీచర్ల విషయానికి వస్తే, నెలవారీ ఖర్చుల విశ్లేషణ, కేటగిరీల వారీగా వివరాలు, ఆర్థిక ట్రెండ్స్ వంటి ఆర్థిక నిర్వహణకు సహాయపడుతుంది. హోమ్ స్క్రీన్ లోనే క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి త్వరగా చెల్లింపులు జరపవచ్చు. చిన్న మొత్తాలను చెల్లించేందుకు పిన్ ఎంటర్ చేయాల్సిన అవసరం కూడా ఉండదు. బిల్లులు, సబ్ స్క్రిప్షన్లు, ఈఎంఐలు, ఎస్ఐపీల ఆటోమెటిక్ చెల్లింపులు కూడా చేసుకోవచ్చు.

భద్రత విషయానికి వస్తే బయోమెట్రిక్ లాగిన్, డివైజ్ బైండింగ్ (రిజిస్టర్ మొబైల్ నుంచి మాత్రమే లావాదేవీలు) వంటి మల్టీ లెవెల్ సెక్యూరిటీ అందుబాటులో ఉంది. అంతేకాకుండా అనుమానాస్పద లావాదేవీలను తక్షణం గుర్తించి హెచ్చరికలు చేస్తుంది.

### నష్టాల్లో ముగిసిన

# స్టాక్ మార్కెట్ సూచీలు



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. విదేశీ మదుపర్ల అమ్మకాలు కొనసాగడం, గరిష్ఠ'ల వద్ద లాభాల స్వీకరణ దీనికి కారణం. రిలయన్స్, ఐసీఐసీఐ వంటి ప్రధాన స్టాక్స్‌లో విక్రయాలు సూచీలపై ఒత్తిడి పెంచాయి. ఆయిల్ అండ్ గ్యాస్, ఫార్మా, ఐటీ షేర్లలో అమ్మకాలు కొనసాగాయి. క్రిస్మస్ సందర్భంగా గురువారం మార్కెట్లకు సెలవు కావడంతో ట్రేడింగ్ యాక్టివిటీ కూడా అంతంతమాత్రంగానే ఉంది.

సెన్సెక్స్ ఉదయం 85,533.11 పాయింట్ల (క్రితం ముగింపు 85,524.84) వద్ద స్వల్ప లాభాల్లో ప్రారంభమైంది. ఆరంభంలో కాసేపు లాభాల్లో కొనసాగినప్పటికీ.. ఆ తర్వాత నష్టాల్లోకి జారుకుంది. ఇంట్రాడేలో 85,342.19 వద్ద కనిష్ఠ'న్ని తాకిన సూచీ.. చివరికి 116.14 పాయింట్ల నష్టంతో 85,408.70 వద్ద ముగిసింది. నిఫ్టీ 35.05 పాయింట్ల నష్టంతో 26,142.10 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 89.78గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఇండిగో, సన్‌ఫార్మా, ఏషియన్ పెయింట్స్, రిలయన్స్ ఇండస్ట్రీస్, హిందుస్థాన్ యూనిలీవర్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. ట్రెంట్, అల్ట్రాటెక్ సిమెంట్, మారుతీ సుజుకీ, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 62.51 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4,494 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# చరిత్రలో తొలిసారి..

**వన్డేల్లో 574 రన్స్.. బీహార్ బ్యాటర్ల విధ్వంసం!**

**లిస్ట్-ఏ క్రికెట్‌లో చరిత్ర సృష్టించిన బీహార్ జట్టు**

**అరుణాచల్ ప్రదేశ్‌పై 50 ఓవర్లలో 574 పరుగుల భారీ స్కోరు**

**14 ఏళ్ల సంచలనం వైభవ్ సూర్యవంశీ 84 బంతుల్లో 190 పరుగులు**

**ఏబీ డివిలియర్స్ ఫాస్టెస్ట్ 150 రికార్డును బద్దలుకొట్టిన వైభవ్**

**కెప్టెన్ సాకిబుల్ గనీ 32 బంతుల్లోనే ఫాస్టెస్ట్ సెంచరీ**

**తమిళనాడు పేరిట ఉన్న 506 పరుగుల రికార్డు బద్దలు**



**రాంచీ:** క్రికెట్ చరిత్రలో కనీవినీ ఎరుగని, అసాధ్యమనుకున్న ఓ అదుతేం ఆవిష్కృతమైంది. భారత దేశవాళీ వన్డే టోర్నమెంట్ విజయ్ హజారే ట్రోఫీలో బీహార్ జట్టు సరికొత్త ప్రపంచ రికార్డును నెలకొల్పింది. బుధవారం రాంచీలోని జేఎస్‌సీఏ ఓవల్ మైదానంలో అరుణాచల్ ప్రదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో బీహార్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి ఏకంగా 574 పరుగుల భారీ స్కోరు సాధించింది. లిస్ట్-ఏ (అంతర్జాతీయ, దేశవాళీ వన్డేలు) క్రికెట్ చరిత్రలో ఇదే అత్యధిక జట్టు స్కోరు కావడం విశేషం. ఈ మ్యాచ్‌లో బీహార్ బ్యాటర్లు పరుగుల సునామీ సృష్టించగా, పలు అరుదైన రికార్డులు బద్దలయ్యాయి. 14 ఏళ్ల కుర్రాడి ప్రళయం.. ఏబీడీ రికార్డు బద్దలు ఈ మ్యాచ్‌లో అసలైన విధ్వంసం సృష్టించింది 14 ఏళ్ల యువ సంచలనం, ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ. కేవలం 84 బంతుల్లో 16 ఫోర్లు, 15 సిక్సర్లతో 190 పరుగులు చేసి అరుణాచల్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. ఈ క్రమంలో కేవలం 36 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసిన వైభవ్, లిస్ట్-ఏ క్రికెట్‌లో భారత ఆటగాళ్లలో రెండో వేగవంతమైన శతకాన్ని నమోదు చేశాడు. అంతటితో ఆగకుండా, కేవలం 54 బంతుల్లో 150 పరుగుల మార్కును అందుకుని ప్రపంచ రికార్డు సృష్టించాడు. ఇప్పటివరకు ఈ రికార్డు దక్షిణాఫ్రికా దిగ్గజం ఏబీ డివిలియర్స్ (64 బంతులు) పేరిట ఉండేది. తన అదుతే ఇన్నింగ్స్‌తో వైభవ్ ఆ రికార్డును బద్దలుకొట్టాడు.

### కెప్టెన్ మెరుపు సెంచరీ.. కొనసాగిన విధ్వంసం

వైభవ్ సృష్టించిన విధ్వంసాన్ని కెప్టెన్ సాకిబుల్ గనీ మరో స్థాయికి తీసుకెళ్లాడు. ఆఖరి ఓవర్లలో మెరుపులు మెరిపించిన గనీ, కేవలం 40 బంతుల్లోనే 10 ఫోర్లు, 12 సిక్సర్లతో 128 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఈ క్రమంలో అతను కేవలం 32 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసి, లిస్ట్-ఏ క్రికెట్‌లో అత్యంత వేగంగా శతకం బాదిన భారత ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. గతంలో ఈ రికార్డు అన్మోల్‌ప్రీత్ సింగ్ (35 బంతులు) పేరిట ఉండేది. వీరితో పాటు వికెట్ కీపర్ బ్యాటర్ ఆయుష్ లోహరుక (56 బంతుల్లో 116), పియూష్ కుమార్ సింగ్ (66 బంతుల్లో 77) కూడా రాణించడంతో బీహార్ జట్టు ఈ చారిత్రక స్కోరును అందుకుంది.

### బద్దలైన పాత రికార్డు

ఈ మ్యాచ్‌లో బీహార్ జట్టు 574 పరుగులు చేయడం ద్వారా లిస్ట్-ఏ క్రికెట్‌లో అత్యధిక స్కోరు రికార్డును తన పేరిట లిఖించుకుంది. ఇంతకుముందు ఈ రికార్డు తమిళనాడు పేరిట ఉండేది. 2022లో అరుణాచల్ ప్రదేశ్‌పైనే తమిళనాడు జట్టు 2 వికెట్ల నష్టానికి 506 పరుగులు చేసింది. ఇప్పుడు ఆ రికార్డును బీహార్ అధిగమించింది. మొత్తంగా ఈ ఇన్నింగ్స్‌లో బీహార్ బ్యాటర్లు 49 ఫోర్లు, 38 సిక్సర్లు బాదారంటే వారి ఆధిపత్యం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ చారిత్రక ప్రదర్శనతో బీహార్ జట్టు, ముఖ్యంగా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ, దేశవ్యాప్తంగా క్రికెట్ అభిమానుల దృష్టిని ఆకర్షించారు.

### సచిన్ టెండూల్కర్ కన్నా వేగంగా

# ఆ మైలురాయి దాటేసిన విరాట్ కోహ్లీ



**బెంగుళూరు:** ఇండియన్ బ్యాటింగ్ స్టార్ విరాట్ కోహ్లీ కొత్త రికార్డు క్రియేట్ చేశాడు. మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ మైలురాయిని అతను దాటేశాడు. లిస్టు ఏ వన్డే క్రికెట్‌లో అత్యంత వేగంగా 16వేల రన్స్ చేసిన క్రికెటర్‌గా కోహ్లీ రికార్డు స్థాపించాడు. విరాట్ కేవలం 330వ ఇన్నింగ్స్‌లో ఆ మైలురాయిని అందుకున్నాడు. విజయ్ హజారా ట్రోఫీ వన్డే టోర్నీలో ఆడుతున్న కోహ్లీ.. ఇవాళ ఆంధ్రాతో జరిగిన మ్యాచ్‌లో హాఫ్ సెంచరీ కొట్టాడు. ఆ క్రమంలో లిస్ట్ ఏ క్రికెట్‌లో 16వేల పరుగుల మైలురాయిని దాటాడు.

గతంలో టెండూల్కర్ 391 ఇన్నింగ్స్‌లో ఆ స్కోరు చేశాడు. బెంగుళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ గ్రౌండ్‌లో జరుగుతున్న మైదానంలో కోహ్లీ శరవేగంగా రన్స్ రాబట్టాడు. సుమారు 15 ఏళ్ల తర్వాత విజయ్ హజారే టోర్నీలో కోహ్లీ ఆడుతున్నాడు. విజయ్ హజారే ట్రోఫీలో కోహ్లీ పేరిట గతంలో మంచి రికార్డు ఉన్నది. అతను 13 మ్యాచుల్లో 68 సగటుతో 819 రన్స్ చేశాడు. వీటిల్లో నాలుగు సెంచరీలు, మూడు ఫిఫ్టీలు ఉన్నాయి.

టెస్టు, టీ20 క్రికెట్ నుంచి కోహ్లీ రిటైరైన విషయం తెలిసిందే. అయితే జనవరి 11 నుంచి కివీస్‌తో జరగనున్న వన్డే సిరీస్‌పై కోహ్లీ కన్నేసినట్లు తెలుస్తోంది.

### విజయ్ హజారే ట్రోఫీలో

# అదరగొట్టిన రోహిత్ శర్మ..

**సిక్కింపై ముంబై విజయం**

**ఎనిమిది వికెట్ల తేడాతో ముంబై విజయం**

**237 పరుగుల లక్ష్యాన్ని 30 ఓవర్లలో ఛేదించిన ముంబై**

**94 బంతుల్లో 155 పరుగులు చేసిన రోహిత్ శర్మ**



**జైపూర్:** విజయ్ హజారే ట్రోఫీలో భాగంగా జైపూర్ వేదికగా సిక్కింతో జరిగిన మ్యాచ్‌లో ముంబై ఎనిమిది వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో ముంబై ఆటగాడు రోహిత్ శర్మ అదుతే ప్రదర్శన కనబరిచాడు. తొలుత బ్యాటింగ్ చేసిన సిక్కిం నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 236 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ముంబై 30 ఓవర్లలోనే 2 వికెట్లు కోల్పోయి 237 పరుగుల లక్ష్యాన్ని సునాయాసంగా ఛేదించింది.

రోహిత్ శర్మ 94 బంతుల్లో 155 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. అతడు తన ఇన్నింగ్స్‌లో 18 ఫోర్లు, 9 సిక్సులు బాదాడు. ముంబై కెప్టెన్ శార్దూల్ పటేల్ రెండు వికెట్లు తీశాడు. రోహిత్‌తో కలిసి అంగ్‌క్రిష్ రఘువంశీ 38 పరుగులు చేసి జట్టు విజయంలో సహకరించాడు. ముషీర్ ఖాన్, సరాఫ్రాజ్ ఖాన్ సోదరులు ముంబైని విజయతీరాలకు చేర్చారు.

సిక్కిం బ్యాటర్లలో ఆశిష్ (87 బంతుల్లో 8 ఫోర్లుతో 79 పరుగులు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. కె.సాయి సాత్విక్ (34), క్రాంతి కుమార్ (34), రాబిన్ లింబో (31 నాటౌట్)లు తమవంతు సహకారం అందించారు. రోహిత్ శర్మ ఫీల్డింగ్ చేస్తున్న సమయంలో ప్రేక్షకులు 'ముంబై రాజా' అంటూ నినాదాలు చేశారు. రోహిత్ శర్మను చూసేందుకు అభిమానులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు.

# అర్జునకు శ్రీకాంత్ పేరు..

**రేసులో గాయత్రి గోపీచంద్, త్రిసాజాలీ ద్వయం**



**న్యూఢిల్లీ:** కేంద్ర ప్రభుత్వం ప్రతీ సంవత్సరం ఇచ్చే క్రీడా అవార్డుల కోసం రంగం సిద్ధమైంది. ఆయా క్రీడా విభాగాల్లో దేశ ఖ్యాతిని ఇనుమడింపజేసేలా రాణించిన ప్లేయర్ల ప్రతిభను గుర్తిస్తూ వారి పేర్లను సిఫారసు చేశారు. ముఖ్యంగా అత్యున్నత క్రీడా పురస్కారంగా పేరొందిన ధ్యాన్‌చంద్ ఖేల్రత్న అవార్డుకు గాను ఈసారి భారత హాకీ వైస్‌కెప్టెన్ హార్దిక్‌సింగ్ పేరును ప్రతిపాదించారు. టోక్యో(2020)తో పాటు పారిస్(2024) ఒలింపిక్స్‌లో కాంస్య పతకాలు గెలిచిన భారత జట్టులో సభ్యుడైన హార్దిక్ అద్భుత ప్రదర్శనతో రాణించాడు. దీనికి తోడు ఇటీవల జరిగిన ఆసియాకప్‌లో పసిడి పతకం గెలువడంలోనూ హార్దిక్‌ది కీలక పాత్ర. మరోవైపు అర్జున అవార్డు కోసం ఈసారి 24మందితో కూడిన ప్లేయర్ల జాబితాను క్రీడాశాఖ విడుదల చేసింది.

ఇందులో రాష్ట్రానికి చెందిన యువ షూటర్ ధనుశ్ శ్రీకాంత్‌తో పాటు యువ షట్లర్ గాయత్రీ గోపీచంద్ ఉన్నారు. ఇటీవల డెఫిలింపిక్స్‌లో బధిర షూటర్ శ్రీకాంత్ తనదైన రీతిలో సత్తాచాటాడు. ప్రత్యర్థి షూటర్లకు దీటైన పోటీనిస్తూ పసిడి పతకాలు ఖాతాలో వేసుకున్నాడు. బ్యాడ్మింటన్‌లో త్రిసాజాలీతో కలిసి గాయత్రీ గోపీచంద్ ఈ మధ్య టోర్నీల్లో నిలకడగా రాణిస్తున్నది. వీరికి తోడు చెస్ ప్రపంచకప్ గెలిచిన తొలి భారత ప్లేయర్‌గా నిలిచిన దివ్యా దేశ్‌ముఖ్, అథ్లెట్ తేజస్విన్ శంకర్, విదిత్ గుజరాతి, మెహులీ ఘోష్, ప్రణతీనాయక్ ఉన్నారు. ఖేల్రత్న అవార్డు కింద ప్లేయర్లకు రూ.25లక్షలు, అర్జున అవార్డుకు రూ.15లక్షల నగదు ప్రోత్సాహకం అందించనున్నారు.

# నాని 'ది ప్యారడైజ్'లో డ్రాగన్ బ్యూటీ..

## కెరీర్‌లోనే బిగ్గెస్ట్ ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్



టాకీస్: 'డ్రాగన్' సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్న అందాల నటి కాయదు లోహర్ ప్రస్తుతం వరుస అవకాశాలతో బిజీగా మారింది. తక్కువ సమయంలోనే భారీ ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకున్న ఆమె, తాజాగా తన కెరీర్‌లోనే అతిపెద్ద ప్రాజెక్ట్‌కు అధికారికంగా ఓకే చెప్పింది. నాని హీరోగా నటిస్తున్న కొత్త తెలుగు సినిమా 'ది ప్యారడైజ్'లో కాయదు లోహర్ కీలక పాత్రలో కనిపించనుంది.
గత కొన్ని రోజులుగా ఈ సినిమా షూటింగ్‌లో ఆమె పాల్గొంటుందనే వార్తలు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి. అయితే వాటిపై ఇప్పటివరకు స్పష్టత లేకపోగా, ఇప్పుడు స్వయంగా కాయదు ఆ వార్తలను కన్ఫార్మ్ చేయడంతో సందేహాలకు తెరపడింది.
'ది ప్యారడైజ్' గ్లింప్స్ విడుదలైనప్పుడు థియేటర్లలో వచ్చిన




రియాక్షన్‌ను చూపిస్తూ కాయదు లోహర్ తన సోషల్ మీడియా ఖాతాలో ఓ వీడియోను షేర్ చేసింది. అదే వీడియో ద్వారా ఈ సినిమాలో తాను భాగమని అధికారికంగా ప్రకటించింది. ఇప్పటికే ఆమె షూటింగ్ కూడా ప్రారంభించినట్లు సమాచారం. ఈ సినిమా నానికి చాలా కీలకమైన ప్రాజెక్ట్‌గా తెరకెక్కుతుండగా, భారీ స్థాయిలో నిర్మిస్తున్న ఈ చిత్రం 2026 మార్చి 26న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్‌కు మంచి స్పందన రావడంతో సినిమాపై అంచనాలు భారీగా పెరిగాయి.
ఈ ప్రాజెక్ట్‌తో పాటు కాయదు లోహర్ మరో బిగ్ మూవీకి కూడా సైన్ చేసింది. దుల్కర్ సల్మాన్ హీరోగా నటిస్తున్న 'ఐం గేమ్' సినిమాలో ఆమె కీలక పాత్రలో కనిపించనుంది. దీనితో పాటు ఆమె చేతిలో ఇంకా కొన్ని ఆసక్తికరమైన ప్రాజెక్టులు ఉన్నట్లు సమాచారం. వరుసగా పెద్ద హీరోల సినిమాల్లో అవకాశాలు దక్కుతుండటంతో కాయదు కెరీర్ జెట్ స్పీడ్‌లో దూసుకెళ్తోంది. వచ్చే ఏడాది విడుదల కానున్న సినిమాలతో 2026 ఆమెకు కెరీర్‌లోనే స్పెషల్ ఇయర్‌గా మారే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. తెలుగు సహా ఇతర భాషల్లోనూ కాయదు లోహర్‌కు మరింత గుర్తింపు రావాలని అభిమానులు ఆశిస్తున్నారు.

MOVIE TIME

# యాక్షన్ గ్లింప్స్



టాకీస్: 'ది గర్ల్ ఫ్రెండ్' చిత్రంలో అమాయకమైన యువతిగా ఆకట్టుకున్న నేషనల్ క్రష్ రష్మిక మందన్న, ఇప్పుడు తన నెక్స్ట్ మూవీ 'మైసా' కోసం వెరైటీ అవతారంలో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. నూతన దర్శకుడు రవీంద్ర పుల్లె తెరకెక్కిస్తున్న ఈ సినిమా నుంచి తాజాగా విడుదలైన యాక్షన్ గ్లింప్స్ సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తోంది. ఈ గ్లింప్స్‌లో రష్మిక కనిపించిన విధానం ఆమె కెరీర్‌లోనే తొలిసారి అని చెప్పాలి. ఒళ్లంతా రక్తం, తెగిపోయిన చేతి బేడీలు, చేతిలో గన్, కళ్లలో రగిలే కోపం ఒక గిరిజన తిరుగుబాటు యువతిగా ఆమె ప్రెజెన్స్ ప్రేక్షకులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది.
ఇప్పటివరకు రొమాంటిక్, ఫీల్ గుడ్, కమర్షియల్ పాత్రలతో అభిమానులను మెప్పించిన రష్మిక, ఈసారి పూర్తిగా రెబల్ యాక్షన్ మోడ్‌లోకి మారిపోయింది.
గ్లింప్స్‌లో వినిపించే వాయిస్ ఓవర్ పాత్రలోని గాంభీర్యాన్ని మరింత పెంచగా, సంగీత దర్శకుడు జేక్స్ బిజోయ్ అందించిన పవర్‌ఫుల్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ యాక్షన్ సీక్వెన్స్‌లకు ప్రాణం పోసింది. ప్రతి ఫ్రేమ్‌లో ఇంటెన్సిటీ కనిపిస్తూ, 'మైసా' ఓ సాధారణ యాక్షన్ సినిమా కాదని ఈ గ్లింప్స్ స్పష్టంగా చెబుతోంది. 'మైసా' అంటే "అమ్మ" అని అర్థం.
గోండు గిరిజన తెగల నేపథ్యంతో తెరకెక్కుతున్న ఈ సినిమా, అన్యాయానికి ఎదురు నిలిచే ఓ సహజ నాయకురాలి కథగా ఉండనున్నట్లు తెలుస్తోంది. స్వేచ్ఛ, పోరాటం, భావోద్వేగాల మేళవింపుతో ఈ చిత్రాన్ని ఓ పవర్‌ఫుల్ యాక్షన్ డ్రామాగా మలుస్తున్నారు.
అన్ ఫార్ములా ఫిల్మ్స్ పతాకంపై అజయ్, అనిల్ సయ్యపురెడ్డి ఈ చిత్రాన్ని అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. రష్మికతో పాటు, 'పుష్ప 2'లో విలన్ పాత్రతో మెప్పించిన తారక్ పొన్నప్ప కీలక పాత్రలో నటిస్తున్నారు. ప్రస్తుతం సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతుండగా, పలు భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.
తాజాగా విడుదలైన యాక్షన్ గ్లింప్స్‌తోనే 'మైసా'పై అంచనాలు భారీగా పెరిగాయి. రష్మిక కెరీర్‌లోనే అత్యంత ఫెరోషియస్, ఇంటెన్స్ పాత్రగా ఇది నిలవనుందని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. మరి రెబల్ అవతారంలో రష్మిక బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి విధ్వంసం సృష్టిస్తుందో చూడాలి.

# అఖండ-2 మేకింగ్ వీడియో విడుదల

టాకీస్: బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో వచ్చిన చిత్రం 'అఖండ 2' ఈ సినిమాలోని కొన్ని పవర్‌ఫుల్ సన్నివేశాలను జార్జియాలో రూపొందించారు. తాజాగా ఆ యాక్షన్ సన్నివేశాలకు సంబంధించి మేకింగ్ వీడియోను చిత్రబృందం విడుదల చేసింది. ప్రస్తుతం ఈ సినిమా థియేటర్‌లో విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. 'అఖండ 2: తాండవం' భారీ అంచనాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అయితే తొలి ఆట నుంచే మిక్స్‌డ్ టాక్‌ను ఎదుర్కొన్న ఈ సినిమా, ఆ తర్వాత నెగటివ్ జోన్‌లోకి వెళ్లడంతో బాక్సాఫీస్ వద్ద ఆశించిన
'అఖండ 2'పై అంచనాలు ఆకాశాన్ని తాకాయి. దాంతో ఈ సినిమా థియేట్రికల్ బిజినెస్ కూడా భారీగా జరిగింది.
తెలుగు రాష్ట్రాలు, కర్ణాటక, తమిళనాడు, మలయాళం, హిందీ భాషలు, ఓవర్సీస్ మార్కెట్ కలిపి రూ.103 కోట్ల ప్రీ రిలీజ్ బిజినెస్ నమోదైంది. ప్రస్తుత పరిస్థితుల్లో సినిమా భారీ నష్టాలతో ముగిసే అవకాశం ఉందని అంచనా. 'అఖండ 2' బాక్సాఫీస్ పరంగా నిరాశపరిచినా, నందమూరి బాలకృష్ణ తన 50 ఏళ్ల సినీ కెరీర్‌లో తొలిసారి 100 కోట్ల గ్రాస్ మైలురాయిని అధిగమించారు. డిజాస్టర్ టాక్ వచ్చిన సినిమాతో కూడా ఈ స్థాయి వసూళ్లు సాధించడం విశేషమని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. తాజాగా సినిమాపై మరింత ఆసక్తి పెంచేందుకు మేకర్స్ అఖండ 2 మేకింగ్ వీడియో



స్థాయిలో ప్రభావం చూపలేకపోయింది. తొలి వారంలోనే తీవ్ర తడబాటుకు గురైన ఈ చిత్రం, చివరకు డిజాస్టర్ దిశగా అడుగులు వేస్తోందని ట్రేడ్ వర్గాలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నాయి. 'అఖండ' సినిమా ఘన విజయం సాధించడంతో, దానికి సీక్వెల్‌గా వచ్చిన
విడుదల చేశారు. ఇందులో బాలయ్య యాక్షన్ సీన్స్, బోయపాటి డైరెక్షన్, లొకేషన్ ఇవన్నీ కూడా ప్రేక్షకులని ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ఇందులోని పవర్ ఫుల్ యాక్షన్ సీన్స్‌ని జార్జియాలో రూపొందింగా, ఇవి అలరిస్తున్నాయి.

## డైలాగ్ ఒక్కటీ లేకుండా

# భయపెట్టించిన గ్లింప్స్




**టాకీస్:** డిఫరెంట్ కాన్సెప్ట్‌లకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన దర్శకుడు రవిబాబు తన తదుపరి సినిమాను అధికారికంగా ప్రకటించారు. పూర్తిగా డైలాగ్‌లేని, భీకరమైన విజువల్స్‌తో కూడిన గ్లింప్స్‌ను విడుదల చేస్తూ, తన కొత్త సినిమా టైటిల్‌ను 'రేజర్' గా వెల్లడించారు. 45 సెకన్ల నిడివి ఉన్న ఈ గ్లింప్స్ పూర్తిగా థ్రిల్లర్ టోన్‌లో సాగింది. చేతులను నరికేయడం, శరీరాన్ని రెండు ముక్కలుగా కోయడం, కత్తితో తల నరికే సన్నివేశాలు చూపిస్తూ, ఒక్క మాట కూడా లేకుండా ప్రేక్షకులను షాక్‌కు గురిచేసింది. విజువల్స్ ఆధారంగా కథా భావనను తెలియజేయడం ఈ గ్లింప్స్ ప్రత్యేకతగా నిలిచింది.

ఈ గ్లింప్స్‌లో రవిబాబు తప్ప మరే ఇతర ప్రముఖ నటులు కనిపించలేదు లేదా ప్రకటించడం చేయలేదు. అయితే, చూపించిన సన్నివేశాలు మాత్రం థ్రిల్లర్ సినిమాల అభిమానులను వెంటనే ఆకట్టుకునేలా ఉన్నాయి. ముఖ్యంగా డార్క్, వైలెంట్ థ్రిల్లర్ జానర్‌ను ఇష్టపడే ప్రేక్షకులకు ఈ సినిమా గట్టిగా కనెక్ట్ అవుతుందనే టాక్ వినిపిస్తోంది. ఈ చిత్రాన్ని ఫ్లయింగ్ ఫ్రాగ్స్ మరియు సురేష్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ రెండు బ్యానర్లు మరోసారి కలిసి పనిచేస్తుండటంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. 'రేజర్' సినిమాను సమ్మర్ 2026లో విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు.

# ఓటీటీలోకి బాహుబలి: ది ఎపిక్

**టాకీస్:** రీరిలీజ్‌లోనూ రికార్డులు తిరగరాసిన 'బాహుబలి: ది ఎపిక్'.. ఇప్పుడు ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమైంది. దర్శకధీరుడు రాజమౌళి తెరకెక్కించిన అద్భుతం 'బాహుబలి'. తెలుగు సినిమా స్థాయిని ప్రపంచానికి చూపిన ఈ బ్లాక్‌బస్టర్ రెండు భాగాలు కలిపి పదేళ్ల తర్వాత 'బాహుబలి: ది ఎపిక్' పేరుతో ఇటీవల ప్రేక్షకుల ముందుకువచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పుడీ చిత్రం ఓటీటీలోకి రానుంది. నెట్‌ఫ్లిక్స్ వేదికగా డిసెంబర్ 25 నుంచి స్ట్రీమింగ్ కానుంది. రెండు భాగాల్లో సుమారు 90 నిమిషాలకు పైగా సన్నివేశాలను తొలగించి థియేటర్లలో విడుదల చేశారు. అక్టోబర్ 31న 'బాహుబలి: ది ఎపిక్' విడుదలైంది. సినిమాల్లో ఉన్న అవంతిక లవ్‌స్టోరీ, పచ్చ బొట్టేసిన పాట, ఇరుక్కుపో సాంగ్, కన్నా నిదురించరా సాంగ్, యుద్ధానికి సంబంధించిన కొన్ని సన్నివేశాలను తొలగించి రిలీజ్ చేశారు. అయితే ఇప్పుడు ఓటీటీలో వీటిని యాడ్ చేస్తారేమో అని అభిమానులు భావిస్తున్నారు. ఒకప్పుడు రికార్డుల్లో చరిత్ర సృష్టించిన ఈ సినిమా రీరిలీజ్‌లోనూ సత్తా చాటింది. రీరిలీజ్‌లో అత్యధిక ఓపెనింగ్స్ సాధించిన చిత్రంగా నిలిచింది. మొదటిరోజు దేశవ్యాప్తంగా రూ.9.25 కోట్లు వసూలుచేసినట్లు సినీ వర్గాలు తెలిపాయి.




Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.